# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

మంగళవారం | 16 జూన్, 2026 | పేజీలు : 08


## ప్రజావాణిలో ఫిర్యాదులకు తక్షణ స్పందన



ప్రజాపక్షం/జనగామ : పాలకుర్తి మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన దివ్యాంగుడు నార గోని యాకయ్యకు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చొరవతో బ్యాటరీ ట్రై సైకిల్ మంజూరైంది. జీవనోపాధి నిత్యావసర పనుల కోసం రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న యాకయ్య ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. దీనిపై వెంటనే స్పందించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్హతలను పరిశీలించిన వికలాంగుల సంక్షేమ శాఖ అధికారులు బ్యాటరీ ట్రై సైకిల్ ను అందజే శారు. దీంతో తన రవాణా సమస్యకు పరిష్కారం లభించిం దని యాకయ్య ఆనందం వ్యక్తం చేశారు. ప్రజావాణి ద్వారా వచ్చిన వినతులను సత్వరమే పరిష్కరిస్తూ జిల్లా పరి పాలన దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని అధికారులు తెలిపారు.

# జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ కల్పించాలి



ప్రజాపక్షం/భూపాలపల్లి : జిల్లాలోని పత్రికలు, ఎలక్ట్రా నిక్ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో 50 శాతం ఫీజు రాయి తీతో విద్య అందించేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూ జెఐజెయూ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం టీయూడబ్ల్యూజే (ఐజెయూ) జిల్లా అధ్యక్షులు క్యాతం సతీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి సామంతుల శ్యామ్, హెల్త్ కమిటీ సభ్యుడు సామల శ్రీనివాస్, చిన్న పత్రికల సంఘం అధ్యక్షులు కుసుమ చంద్రశేఖర్ ఆధ్వ ర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమాజానికి సమాచార వారధులుగా పనిచేస్తూ ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం నిరంతరం శ్రమి స్తున్న జర్నలిస్టుల కుటుంబాలు మాత్రం అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యా ఫీజులు భారీగా పెరిగిపోవడంతో జర్నలిస్టులు తమ పిల్ల లకు నాణ్యమైన విద్యను అందించడంలో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా జిల్లాల్లో పనిచేస్తున్న విలేకరుల ఆదాయం పరిమితంగా ఉండటంతో విద్యా భారం మరింత పెరుగుతోందన్నారు. జర్నలిస్టుల సేవ లను గుర్తించి, వారి పిల్లలకు ప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యాసంస్థల్లో కనీసం 50 శాతం ఫీజు రాయితీ కల్పిం చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక విధానం రూపొం దించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా విద్యాశాఖ అధికారికి కూడా వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు విజయ్, సుధాకర్, రామారావు, పవన్‌తో పాటు పలువురు విలేకరులు పాల్గొన్నారు.

### ఫిర్యాదులు
## తక్షణమే పరిష్కరించండి



వివిధ విభాగాలకు చెందిన
85 ఫిర్యాదుల స్వీకరణ
బల్దియా అదనపు కమిషనర్ జోనా

ప్రజాపక్షం/ఖిలావరంగల్: దరఖాస్తు దా రులు సమర్పించిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని బల్దియా అదనపు కమిషనర్ జోనా అన్నారు. సోమవారం ప్రజావాణి(గ్రీ వెన్స్) కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిడ బ్ల్యుఎంసి ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అద నపు కమిషనర్‌తో పాటు వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు నగర ప్రజల నుండి వివిధ సమస్యల పరిష్కారం కోసం అందజే సిన దరఖాస్తులను పరిష్కారార్థం స్వీకరిం చారు. ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యా దుల వివరాలు విభాగాల వారిగా టౌన్ ప్లానింగ్ 41, ఇంజనీరింగ్ 24, రెవెన్యూ 07, హెల్త్, శానిటేషన్ 10, నీటి సరఫరా 03, మొత్తం 85 వచ్చాయి. ఈ కార్యక్రమంలో డిఎ ఫ్ఓ శంకర్ లింగం, ఇన్‌చార్జి సిపి రవీందర్ రాడేకర్, పన్నుల అధికారి రామకృష్ణ, ఎంహె చ్ఓ డాక్టర్ రాజేష్, సెక్రటరీ అనిల్ బాబు, హెచ్ఓ లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ స్టేడియంలో అథ్లెటిక్ అకాడమీ కొనసాగించాలి

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన
మెదక్ సిటిజన్ ఫోరం నాయకులు

ప్రజాపక్షం/మెదక్ : మెదక్ జిల్లా అభివృద్ధి, విద్యాసదుపాయాల విస్త రణ, క్రీడల ప్రోత్సాహానికి సంబంధించిన పలు సమస్యలను పరిష్కరిం చాలని కోరుతూ మెదక్ సిటిజన్ ఫోరం నాయకులు సోమవారం ప్రజా వాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఫోరం నాయకులు కొండల్ రెడ్డి, పీడీ ఆనందం, భూపాల్ రెడ్డి, నాగభూషణం, నర్సింలు గౌడ్, కానుగు రాజ శేఖర్, విద్యాసాగర్ మాట్లాడుతూ మెదక్ స్టేడియంలో కొనసాగుతున్న అథ్లెటిక్ అకాడమీని యథావిధిగా కొనసాగించేలా చర్యలు తీసుకోవా లని కోరారు. జిల్లా యువతకు క్రీడల్లో మెరుగైన అవకాశాలు కల్పిం చేందుకు అకాడమీ అవసరమని పేర్కొన్నారు. అలాగే మెదక్ పట్టణ కేంద్రంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బాలుర, బాలికల రెసిడెన్షి యల్ జూనియర్ మరియు డిగ్రీ కళాశాలలకు శాశ్వత స్థలాలను కేటా యించి నూతన భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం సరైన మౌలిక సదుపాయాల లేమితో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని తెలిపారు. మెదక్ నుంచి మక్త భూపతిపూర్ వెళ్లే రహదారి గత వర్షాకాలంలో దెబ్బతిన్నందున వెంటనే మరమ్మతులు చేపట్టి పటిష్టం చేయాలని కోరారు. అలాగే కొంటూరు నుంచి వెంకటాపూర్‌కు వెళ్లే మార్గంలో కొంటూరు చెరువు అలుగు పారడం వల్ల వెంకటాపురం, శివాయిపల్లి, గుట్టకిందిపల్లే గ్రామాల ప్రజలు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అక్కడ శాశ్వత వంతెన నిర్మించాలని డిమాండ్ చేశారు. మెదక్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించి నూతన భవన నిర్మాణం చేపట్టాలని, అలాగే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు హాస్టల్ సదుపాయాలు కల్పించాలన్నారు. జిల్లా అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్, గ్రామీణ ప్రాంతాల రవాణా పొకార్యాల దృష్ట్యా తమ వినతులను సానుకూ లంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని సిటిజన్ ఫోరం నాయకులు జిల్లా కలెక్టర్‌ను కోరారు.



## కోర్టుకు హాజరు కాని వ్యక్తి రిమాండ్

ప్రజాపక్షం/మహాదేవపూర్: కోర్టుకు హాజరు కాని వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సాంబ మూర్తి సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు.గత 2020 సంవత్సరంలో జరిగిన సంఘటనలో ఆటో అద్దం పగులగొట్టి బూతులు తిట్టిన వ్యక్తిపై చేసిన ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో కోర్టు విచార ణకు హాజరు కాకపోవడంతో మెజిస్ట్రేట్ నాన్‌బెయి లెబుల్ వారంట్ జారీ చేసారని తెలిపారు.ఈ మేరకు న్యాయమూర్తి ఆదేశాల అనుసారం కోర్టుకు హాజరు కాని దుర్గం సురేష్ ను పట్టుకుని విచారణ అనంతరం రిమాండ్ విధించి పరకాల సబ్ జైలుకు పంపినట్లు తెలిపారు.కోర్టుకు వెళ్లే ప్రతి వ్యక్తి క్రమం తప్పకుండా పేషీలకు హాజరు కావాలని లేనిపక్షంలో వారిని జైలుకు తరలిస్తామని తెలిపారు.

## 20న జాతీయ లోక్ అదాలత్

ప్రజాపక్షం/భూపాలపల్లి : ఈనెల20న నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్ లో పెద్ద ఎత్తున కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి,న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి టి.కన్నయ్య లాల్ సూచించారు. న్యాయవాదులు, కోర్టు కానిస్టేబుల్స్ తో సోమవారం వేరు వేరుగా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేసుల పరిష్కారంలో రాజీ మార్గాన్ని ప్రోత్సహించాలని వారు అన్నారు. జాతీయ లోక్ అదాలత్ లో కేసులోని ఇరువర్గాల వారు స్నేహపూర్వక వాతావరణంలో తమ కేసులను పరిష్కారం చేసుకుంటే విలువైన సమయం, డబ్బులు వృధా కావని, మనశాంతిని పొందవచ్చని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.అఖిల, అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆకుల రాములు, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఇందరపు శివకుమార్, పాల్గొన్నారు.

## ఉత్తమ ప్రతిభ చాటిన పదవ తరగతి విద్యార్థులకు బహుమతుల ప్రధానం

ప్రజాపక్షం/తాడ్వాయి: మండల పరిధిలోని కోడిశాల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల నూతన విద్యా సంవత్సరం(2026...2027) సందర్భంగా సోమవారం ఘనంగా పునః ప్రారంభమైంది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవదాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి లింగాల గ్రామ పంచాయతీ సర్పంచ్ మొగిలిపల్లి రవీందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మొగిలిపల్లి రవీందర్ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా చూస్తామని, స్కూల్‌లో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. స్థానిక సంస్థల పరంగా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, పిడి ఆది నారాయణ, కోటేశ్వరరావు, సిహెచ్ కృష్ణ, జగపతి రావు, రవీందర్, దేవుల అశోక్, తదితర ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## బడిబాట కార్యక్రమం

ప్రజాపక్షం/జఫర్‌గఢ్:మండలంలోని షాపల్లి సర్పంచ్ తాళ్లపెల్లి సుభాష్ చంద్రబోస్ ప్రాథమికోన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా స్కూల్లో శ్రమదానం చేసి అంగన్వాడి కేంద్రంలో మొక్కలను నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మమత రాజు, వార్డు మెంబర్లు లలిత ప్రభాకర్, ముస్తఫా, అనిల్ రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షులు యాదగిరి, యూత్ సభ్యులు రాజుకుమార్, సారంగం, హెచ్ఎం, ఉపాధ్యాయులు, నసీమ సుల్తానా, విద్యార్థులు పాల్గొన్నారు.

## కెటికె–5 గనిలో ప్రమాదం

### గనిలో పేలుడు.. కార్మికుడికి తీవ్ర గాయాలు



ప్రజాపక్షం/భూపాలపల్లి : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని సింగరేణి భూపాలపల్లి ఏరియాకు చెందిన కేటీకే5 గనిలో సోమవారం ప్రమాదం చోటుచేసుకుంది. బొగ్గు ఉత్పత్తి కోసం నిర్వహిస్తున్న బ్లాస్టింగ్ పనుల సమయంలో పేలుడు సంభవించడంతో ఓ కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. కేటీకే5 గనిలో తొలి షిఫ్ట్‌లో విధులు నిర్వహిస్తున్న షార్ట్ ఫైరర్ శ్రీరాముల ప్రదీప్ 13వ లెవెల్‌లో బ్లాస్టింగ్ పనులు చేపట్టాడు. ఈ క్రమంలో పూర్ణిమ (మందు గుండు) స్కాన్ చేస్తున్న గ్రామంలో ప్రమాదవశాత్తు అతని చేతిలో ఉన్న పూర్ణిమ ప్రమాదవశాత్తు పేలడంతోఈ ఘటనలో శ్రీరాముల ప్రదీప్ ఎడమ చేతికి తీవ్ర గాయాలయ్యాయి. పేలుడు శబ్దం వినిపించడంతో అప్రమత్తమైన తోటి కార్మికులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన ప్రదీప్‌ను బయటకు తీసుకొచ్చారు. అనంతరం భూపాలపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. గాయాల తీవ్రత ఎక్కువగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రత్యేక ఆస్పత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు.ఘటనపై సింగరేణి అధికారులు ఆరా తీస్తుండగా, ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టినట్లు సమాచారం. ఈ ఘటనతో గనుల్లో భద్రతా ప్రమాణాల అమలు, పేలుడు పదార్థాల నిర్వహణపై మరోసారి చర్చ మొదలైంది.

## తాటి చెట్టుపై నుండి పడి గౌడ్ మృతి



ప్రజాపక్షం/భూపాలపల్లి/రేగొండ: గాల్లోనే గౌడన్నల జీవితాలు ఆరిపోతున్నాయని తెలంగాణ గౌడ సంఘము జిల్లా అధ్యక్షులు శ్రీపతి ప్రభాకర్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు.సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రానికి కి చెందినగండి సదయ్య (55) ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుండి పడి తీవ్ర గాయాల పాలై అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వృత్తినే జీవనాధారంగా చేసుకొని కుటుంబ బారాలను వెల్లదీసుకుంటున్న గౌడన్నలు తాటి చెట్లపై నుండి పడి మృత్యువాత పడుతుండడంతో గౌడన్నల కుటుంబాలు వీధిన పడుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, గౌడన్నల జీవితాలకు భరోసాను కల్పించాలని, మృతి చెందిన గండి సదయ్య గౌడ్ కుటుంబం వీధిన పడకుండా రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, గౌడన్నలకు ప్రమాదాలు జరగకుండా ప్రత్యామ్నాయంగా కాటమయ్య రక్ష కవచం కిట్ల ను ప్రతి గౌడ కుటుంబానికి అందించాలని తెలంగాణగౌడసంఘము జిల్లా అధ్యక్షులు శ్రీపతిప్రభాకర్ గౌడ్, జిల్లా కార్యదర్శి మామిండ్ల శ్రీనివాస్గౌడ్ ఉపాధ్యక్షులు తడుకసుధాకర్ గౌడ్, సొసైటీ అధ్యక్షులు మరియు గౌడ కులస్తులు ప్రభుత్వాన్ని కోరారు.

## విద్యార్థుల అడ్మిషన్‌ల కోసం విస్తృత ప్రచారం




ప్రజాపక్షం/కాళేశ్వరం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరి విద్యార్థులు తమ భవిష్యత్తుకు పునాది నిర్మించుకోవాలని కాళేశ్వరం సర్పంచ్ వెన్నపురెడ్డి మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం గ్రామంలో సోమవారం మహాదేవపూర్ డిగ్రీ కళాశాల అధ్యాపకుల బృందంతో కలిసి విద్యార్థుల అడ్మిషన్‌ల కోసం విస్తృత ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులను,వారి తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అందుబాటులో ఉన్న కోర్సులు,స్కాలర్‌షిప్‌లు,ఉచిత విద్యా సదుపాయలు,నైపుణ్యాభివృద్ధి మరియు ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు.అనంతరం కాళేశ్వరం సర్పంచ్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ...ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నైపుణ్యం కలిగిన అధ్యాపకులతో పాటు సృజనాత్మకతతో కూడిన విద్యను అందిస్తున్నారని తెలిపారు.నియోజకవర్గంలోని మహాదేవపూర్ మండల కేంద్రంలో ఉన్న ఒకే ఒక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని దోస్త్ వెబ్‌సైట్ ద్వారా ప్రభుత్వం ఆన్‌లైన్‌లో డిగ్రీ ప్రవేశం పొందేందుకు సులభతరం చేసిందని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో కాళేశ్వరం ఉప సర్పంచ్ చెమ్మాల సుదీర్,డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ జన్ను విజయకుమార్,పలువురు అధ్యాపకులు పాల్గొన్నారుపాల్గొన్నారు.

## జిల్లా స్థాయి క్రికెట్‌లో సత్తా చాటిన మంగపేట యువకులు



ప్రజాపక్షం/మంగపేట: ములుగు క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కుంజా సూర్య ఆధ్వర్యంలో నిర్వహించబడిన R45 జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ లో మంగపేట గ్రామపంచాయతీ టీం సత్తాచాటి మూడవ స్థానం దక్కించుకుంది. గత 20 రోజులుగా ములుగు జిల్లా జాకారం స్టేడియంలో కొనసాగుతున్న ఈ టోర్నమెంట్ లో జిల్లా వ్యాప్తంగా 45 టీం లు పాల్గొన్నాయని ఆ టీం లతో చివరి వరకు పోరాడి 3వ స్థానం దక్కించుకున్నట్లు మంగపేట గ్రామ పంచాయతీ క్రికెట్ టీం కెప్టెన్ సయ్యద్ ఖాలీద్ తెలిపారు. ఆదివారం సాయంత్రం జాకారం స్టేడియంలో కుంజా సూర్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహుమతుల ప్రధానోత్సవంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్ చేతుల మీదుగా కప్ తో పాటు తృతీయ బహుమతి క్రింద 15 వేల రూపాయలు నగదును అందుకున్నట్లు ఖాలీద్ వెల్లడించారు. గ్రామాల అభివృద్ధిలో యువత భాగస్వామ్యం ప్రధాన్యతను తెలియజేసేందుకు కుంజా సూర్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నీ తమకు ఎంతగానో ఉపయోగపడిందని క్రీడాకారులు అన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు డిఎస్ పి.రవీందర్,టీం సభ్యులు చల్ల రాంకీ ఎడ్లపెల్లి సాయిరాం, వట్టెం నరేందర్, చల్ల శ్రీహరి, మహమ్మద్ యాసీర్, పూజారి రమేష్, గణేష్, పల్లపు రమేష్ పాల్గొన్నారు.

## బచ్చన్నపేట మోడల్ స్కూల్‌లో ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ

ప్రజాపక్షం/బచ్చన్నపేట: మండల కేంద్రంలోని స్థానిక మోడల్ స్కూల్‌లో సోమవారం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. పాఠశాల ప్రిన్సిపల్ భారతి దేవితో కలిసి బచ్చన్నపేట గ్రామ సర్పంచ్ ఆల్వాల నర్సింగరావు విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. ప్రభుత్వం సరఫరా చేసిన ఈ పాఠ్య పుస్తకాలను విద్యార్థులంతా సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## బెల్టు షాపులపై ఉక్కుపాదం

ప్రజాపక్షం/జఫర్‌గఢ్: గ్రామంలో అక్రమ మద్యం విక్రయాలపై పంచాయితీ పాలకవర్గం కొరడా ఝులిపించింది. శనివారం సర్పంచ్ ఎడ్ల వెంకటయ్య ఆధ్వర్యంలో పంచాయితీ సిబ్బంది వార్డు ప్రతినిధులు కలిసి బెల్ట్ షాపులపై ఆకస్మిక దాడులు చేపట్టారు. మహిళల ఫిర్యాదులతో రంగంలోకి దిగిన సర్పంచ్ బాటిళ్ల తనిఖీ చేసి నిర్వాహకులను హెచ్చరించారు. ఇది ఒకరోజు డ్రైవ్ కాదు, గ్రామంలో ఒక్క చుక్క అక్రమ మద్యం అమ్మనివ్వం, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సర్పంచ్ స్పష్టం చేశారు. రఘునాథపల్లిని ఆదర్శగ్రామంగా నిలబెడతామని పిలుపునిచ్చారు. పంచాయితీ నిరంతర నిఘాపై మహిళా సంఘాలు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ తనిఖీలలో గ్రామ పంచాయితీ సిబ్బంది, వార్డు ప్రతినిధులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాపక్షం/కొడకండ్ల: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ధ్యేయంగా పని చేస్తుందని కొడకండ్ల సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తెలంగాణ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థినిలకు పాఠశాల ప్రారంభోత్సవమును ప్రిన్సిపల్ తమ్మి దివీతో కలిసి కేక్ కట్ చేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినిలు గురుకుల పాఠశాలను సద్వినియోగం చేసుకుని రాణించాలని సూచించారు. పాఠశాలను నెంబర్ వన్ స్థానంలో నిలుపుతున్న ఉపాధ్యాయులను అభినందించారు. నోట్ బుక్స్, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ప్రజాపక్షం/పాలకుర్తి: ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని తహశీల్దార్ సరస్వతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆహ్వాన కార్యక్రమం నూతన ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్ ప్రారంభోత్సవం, పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు తహశీల్దార్ సరస్వతి, ఎంఈవో పోతుగంటి నర్సయ్య, గ్రామ సర్పంచ్ కమ్మగాని విజయ చేతుల మీదుగా నోట్ బుక్స్ పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం చిదురాల శ్రీనివాస్, ఏపీపీసీ చైర్మన్ శ్రీలత, ఉపాధ్యాయ బృందం శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

## వంట కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సర్పంచ్‌లకు వినతి

ప్రజాపక్షం/ములుగు: తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం నుండి ఈ నెల 20వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్న భోజన వంట కార్మికుల సమస్యల పరిష్కార నిమిత్తం ప్రధానోపాధ్యాయులకు, సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు, ములుగు జిల్లాలోని మదనపల్లి, పత్తిపెల్లి గ్రామాలలో స్వయంగా పాల్గొని వినతిపత్రాలు అందజేసి కార్యక్రమాన్ని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని 54వేల రెండు వందల మంది వంట కార్మికులు ఈరోజు అనేకమైన ఇబ్బందులకు గురవుతున్న సందర్భంలో రాష్ట్ర వ్యాప్తంగా వినతిపత్రాలు అందజేసి మన బాధలు తెలియజేయాలనే ఈ నెల 20 వరకు కొనసాగుతుందన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ప్రధానోపాధ్యాయులు, సర్పంచ్‌లు స్పందించి వారి వద్ద అయ్యే కార్యక్రమాలను పరిశీలించాలని, అలాగే జిల్లా అధికారులకు ఈ వినతిపత్రాలు పంపించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం ప్రకారం రూ.10వేల వేతనాలు వెంటనే చెల్లించాలని, సరుకులు మొత్తం ప్రభుత్వమే సరఫరా చేయాలని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మురహరి రాము, సోమిడి అరుణ,లలిత, సారా సారమ్మ.పాల్గొన్నారు.

## పులిగిల్లలో వెల్కమ్ డే కార్యక్రమం

ప్రజాపక్షం/నడికూడ : మండల పరిషత్ ఉన్నత ప్రాథమిక పాఠశాల (ఎంపీయూపీఎస్) నడికూడ మండలం పులిగిల్ల గ్రామంలో నూతన విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని వెల్కమ్ డే స్కూల్ రెడీనెస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కున్సోతు హనుమంతరావు మాట్లాడుతూ, పాఠశాల విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల స్వామి మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు నైతిక విలువలను కూడా అలవర్చుకోవాలని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేసినప్పుడే విద్యార్థుల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ఉమా, పద్మ, కవిత, ప్రదీప్ ,రాజేష్, రమేష్, విద్యార్థుల తల్లిదండ్రులు, సూరమ్మ, సారమ్మ, శైలజ పాల్గొన్నారు.

## చనిపోయిన కోళ్లను విచ్చలవిడిగా పడేస్తున్న ఫారమ్ యాజమాన్యం

ప్రజాపక్షం/వేలేరు: కోళ్ల ఫారాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని మండలప్రజలు బాహాటంగానే చర్చించుకుంటున్నారు.మండలంలోని పలుగ్రామాలలోని కోళ్ల ఫారాలలో వేసవి తాపానికి గురై చనిపోయిన కోళ్లను బహిరంగ ప్రదేశాలలో పడవేయడం వలన వీధికుక్కలు తిని ప్రయాణికులను ఇబ్బందులు పెడుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు.వేలేరు మండలంలోని పీచర గ్రామశివారులోని ఒకోళ్ల ఫారం వద్ద చని పోయిన కోళ్లను పడవేడవలన వీధికుక్కలతో పలు రకాల జంతువులు తినడమేకాకుండా మిలిన వ్యర్థ పదార్థాలు రోడ్డు సమీపంలో ఉండడం వలన ప్రయాణీకులకు దుర్వాసన వస్తోందని పలువురు ప్రయాణీకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి మండలంలోని పలు పౌల్ట్రీ ఫారమ్ లను తనిఖీ చేసి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా శాస్త్రీయ పద్ధతిలో పూడ్చివేయడం లేదా బయోసెక్యూరిటీ నిబంధనలు పాటించే విధంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండలప్రజలు కోరుతున్నారు.

## భద్రకాళీ అమ్మవారిని, రుద్రేశ్వర స్వామిని దర్శించుకున్న ఇనగాల

ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : వరంగల్ మహానగరంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ భద్రకాళీ దేవస్థానంలో అత్యంత వైభవంగా జరుగుతున్న ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవంలో వరంగల్ కుడా చైర్మన్, హనుమకొండ డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పాల్గొన్నారు.సోమవారం నుండి బుధవారం వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ మహోత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఆయన ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డికి దేవాలయ ప్రధాన అర్చకులు శేషు అయ్యగారు, దేవాదాయ శాఖ ఈవో ఆర్. సునీత ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన భద్రకాళీ అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. వేద పండితులు ఆయనకు ఆశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## అన్నార్తుల ఆకలి తీర్చడం గొప్ప సేవా గుణం



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : అన్నార్తుల ఆకలి తీర్చడం గొప్ప సేవా గుణమని, మానవ సేవయే మాధవసేవ అన్న నానుడికి నిదర్శనమే శ్రీ భద్రకాళి వీరభద్ర సేవాసమితి నిర్వాహకుల సంకల్పం అన్నప్రసాద వితరణ అని ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ అన్నారు. సోమవారం బాలసముద్రంలో నిర్వహించిన అమావాస్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో కాళీ ప్రసాద్ అతిథిగా పాల్గొని అన్న ప్రసాద వితరణ చేశారు. ఎండ వేడిమిని తట్టుకొని అన్నార్తులకు సేవ చేస్తున్న నిర్వాహకుల సంకల్పం గొప్పదని కొనియాడారు. సుమారు 600 మందికి అన్న ప్రసాద వితరణ అందించడం మహా సంకల్పం అన్నారు.ప్రతి నెల అమావాస్య రోజున నిర్వహించే అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి నా వంతు సహకారం కూడా అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పిన్నా శివకుమార్, చోల్లేటి శ్రీధర్, మహేష్, డాక్టర్ పాడిచెట్టి విష్ణువర్ధన్, ధనుంజయ, నల్లా దిలీప్ కుమార్, ప్రభాకర్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు నారాయణరెడ్డి, విశ్రాంత ఎల్ఐసి అధికారి పాములపర్తి కేశవకుమార్,అల్లం రాజేష్ వర్మ,ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి



ప్రజాపక్షం/వరంగల్: అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినందున కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డిజిల్, వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అమెరికా, ఇరాన్ మధ్యన శాంతి ఒప్పందం కుదిరి యుద్ధ వాతావరణం తొలగిపోయిన నేపథ్యంలో మార్చిలో 118 డాలర్ల వద్ద ఉన్న క్రూడ్ ఆయిల్ ధర నేడు 84 డాలర్లకు పడిపోవడంతో బ్యారెల్‌కు 34 డాలర్లు తగ్గిందని అనగా 30శాతం ధరలు తగ్గాయని అన్నారు. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు భారీగా తగ్గినందున ఏమాత్రం కాలయాపన చేయకుండా అంతర్జాతీయంగా తగ్గిన ధరల కనుగుణంగా ధరలు తగ్గించి పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో వారం రోజుల వ్యవధి లోనే మూడుసార్లు పెట్రోలు, డిజిల్ రేట్లు, వంట గ్యాస్ ధరలను రెండుసార్లు అడ్డగోలుగా అంతులేకుండ పెంచడంతో దాని ప్రభావం రవాణాపై పడి నిత్యావసర వస్తువులైన బియ్యం, పప్పులు, నూనెలు కూరగాయలు మొదలైన వాటి ధరలు చుక్కలంటి సామాన్య ప్రజలు బ్రతుకులు దుర్భరంగా మారాయన్నారు. ఉదాహరణకు కిలో కూరగాయలు కొనుక్కునే కుటుంబం పావు కిలోనే కొనుక్కొని అర్ధాకలితో కాలం గడుపుకునే పరిస్థితి దాపురించిందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి సామాన్య ప్రజలపై భారాలను మోపే ఆర్థిక విధానాలను విడనాడాలన్నారు. భడా పారిశ్రామిక కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసి దేశ సంపదను వారికి దోచిపెట్టడం మానుకోవాలన్నారు. కార్మిక, కర్షక, శ్రమజీవుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పాలన కొనసాగించాలన్నారు. లేనిచో దేశవ్యాప్తంగా ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## తల్లిదండ్రులు, విద్యార్థులు బాధ్యతతో ముందుకు సాగాలి



ప్రజాపక్షం/హనుమకొండటౌన్: తెలంగాణ రాష్ట్రంలో పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు కొత్త విద్యా సంవత్సరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ కోరారు.సుమారు 50 రోజుల వేసవి సెలవుల అనంతరం విద్యార్థులు మళ్లీ పాఠశాలల బాట పట్టడం ఆనందకరమైన విషయమని, ఈ సమయమే విద్యార్థుల్లో క్రమశిక్షణ, చదువుపై ఆసక్తి, సమయపాలన వంటి మంచి అలవాట్లను పెంపొందించడానికి సరైన అవకాశమని ఆయన అన్నారు.ప్రస్తుతం చిన్నారులు అధికంగా సెల్‌ఫోన్లు, టీవీలు, వీడియో గేమ్స్ వంటి వాటికి అలవాటు పడుతున్నారని, దీంతో ఏకాగ్రత, చదువుపై దృష్టి తగ్గే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లల స్క్రీన్ టైమ్‌ను నియంత్రించి, పుస్తక పఠనం, వార్తాపత్రికల చదవడం, విజ్ఞానాన్ని పెంచే కార్యక్రమాల వైపు వారిని ప్రోత్సహించాలని సూచించారు.పిల్లలు చెప్పింది కంటే చూసింది ఎక్కువగా నేర్చుకుంటారు. తల్లిదండ్రులే ఎప్పుడూ టీవీ లేదా మొబైల్‌లో నిమగ్నమై ఉంటే పిల్లలు చదువుపై దృష్టి పెట్టడం కష్టమవుతుంది. అందువల్ల ముందుగా పెద్దలు ఆదర్శంగా నిలవాలి" అని నిమ్మల శ్రీనివాస్ అన్నారు.విద్యార్థులు కూడా కొత్త తరగతుల్లో చేరిన తొలి రోజు నుంచే పాఠాలను శ్రద్ధగా వినడం, ప్రతి రోజూ పునశ్చరణ చేయడం, హోంవర్క్‌ను సకాలంలో పూర్తి చేయడం, ఉపాధ్యాయుల సూచనలను పాటించడం వంటి అలవాట్లు పెంచుకోవాలని సూచించారు. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లల విద్యను అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని, వారిలో చదువుపై ఆసక్తిని పెంపొందించేందుకు నిరంతరం ప్రోత్సాహం అందించాలని ఆయన కోరారు.కొత్త విద్యా సంవత్సరంలో ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, కష్టపడి చదివి విజయాలు సాధించాలని సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ ఆకాంక్షించారు.

## గిరిజనుల నిధులతో చేపట్టిన రోడ్డు పనులు వెంటనే నిలిపివేయాలి



ప్రజాపక్షం/రాయపర్తి: గిరిజన అభివృద్ధి కోసం ప్రభుత్వం కేటాయించే నిధులు నిజమైన ప్రజా అవసరాలకు వినియోగించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గిరిజనుల నిధులతో చేపట్టిన రోడ్డు పనులను వెంటనే నిలిపివేయాలని రాష్ట్ర ఎస్‌టి యూనియన్ ఉపాధ్యక్షులు భూక్య సురేందర్ రాథోడ్ నాయక్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఉపయోగం లేని పనులకు నిధులు కేటాయించడం గిరిజన అభివృద్ధి లక్ష్యాలకు విరుద్ధమని పేర్కొన్నారు. నిరుపయోగమైన రహదారులకు నిధులు మంజూరు చేసిన అధికారులు, సంబంధిత సాంకేతిక సిబ్బంది పాత్రపై సమగ్ర విచారణ జరపాలి, అవసరమైతే విజిలెన్స్ లేదా స్వతంత్ర్య కమిటీతో దర్యాప్తు నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. గిరిజనుల అభివృద్ధి కోసం కేటాయించిన ప్రతి రూపాయి గిరిజన తండాల మౌళిక వసతుల అభివృద్ధికే ఖర్చు కావాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామ సమస్యలు పక్కనపెట్టి రహదారికే ప్రాధాన్యత ఎందుకని అన్నారు. సూర్య తండా గ్రామంలో తాగునీటి సమస్యలు, అంతర్గత రహదారుల కొరత, డ్రైయినేజీ సౌకర్యాల లేమి, విద్య, వైద్య, సేవల అభివృద్ధి వంటి అనేక సమస్యలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారని అన్నారు. అలాంటి పరిస్థితుల్లో అత్యవసర అవసరాలను విస్మరించి రూ.40లక్షలతో కొత్త రహదారి నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వడం వెనుక ఉద్దేశ్యం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే రోడ్డు పనులను నిలిపివేయాలని కోరారు.

## పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు అందించాలి



ప్రజాపక్షం/వరంగల్: పేద ప్రజలందరికి ఇందిరమ్మ ఇళ్లను అందించాలని ఎంసిపిఐ(యు) కాశిబుగ్గ ఏరియా కార్యదర్శి పరిమళ గోవర్ధన్ రాజు అన్నారు. సోమవారం వరంగల్ తహశీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాశిబుగ్గలో అద్దెకువందల సంఖ్యలో ఉంటున్నారని, 20, 30 సంవత్సరాల నుంచి పేదరికంతో ఇబ్బంది పడుతూ ఉంటే ప్రజలు ఓట్లేసి ప్రభుత్వాలను గెలిపిస్తూ ఉంటే ప్రభుత్వాలు మాత్రం ప్రజలను ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదని, ఇంటికోసం ఎన్నిసార్లు దరఖాస్తు పెట్టుకున్న టిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ అని చెప్పి ప్రజలను మోసం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ పేరు మీద మోసం చేస్తున్నారు, ఎన్నికల ముందు ఆరు పథకాలుపెట్టిన ప్రభుత్వం ఏది అమలు చేయలేకపోయిందన్నారు. తిమ్మాపూర్ నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను తక్షణమే అర్హులకు కేటాయించాలన్నారు. ఈకార్యక్రమంలో మహిళా సంఘ రాష్ట్ర నాయకురాలు అన్నపోయిన ప్రేమలత, యువజన సంఘ నాయకుడు జెట్టిరాజు, విజయ, రాధ, సురేష్ తదితరులు పాల్గొన్నారు

## పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

ప్రజాపక్షం/కేయూక్యాంపస్: యువ నాయకుడు దుగ్గంపూడి రంజిత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని హనుమకొండ పశ్చిమ నియోజకవర్గ పరిధి 50వ డివిజన్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేయడం అభినందనీయమని కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ పేర్కొన్నారు. సమాజ సేవలో ముందుంటూ పేద ప్రజలకు అండగా నిలుస్తున్న విజయ ప్రకాశ్ రెడ్డి సేవలను ఆయన ప్రశంసించారు. స్థానిక జూలైవాడ జంక్షన్‌లో విజయ ప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో 50వ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ మాట్లాడుతూ, విజయ ప్రకాశ్ రెడ్డి గత కొన్ని సంవత్సరాలుగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేద ప్రజలకు అండగా నిలుస్తున్నారని అన్నారు. యువ నాయకుడు దుగ్గంపూడి రంజిత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేయడం ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మౌలా కృష్ణమూర్తి, తాళ్లపల్లి రామస్వామి గౌడ్, రింకు, ఇర్ఫాన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ సదస్సులో డాక్టర్ ఆదిరెడ్డి ప్రతిభ

ప్రజాపక్షం/కేయూక్యాంపస్: అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రంలో ఎరోడెక్స్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 2026 మే 28, 29 తేదీలలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో కాకతీయ విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం అధ్యాపకుడు డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి ప్రతిభ కనబరిచారు. "ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ టెక్నాలజీ, సైన్స్ అండ్ మల్టీడిసిప్లినరీ ఇన్నోవేషన్–2026" అంశంపై జరిగిన ఈ అంతర్జాతీయ సదస్సులో ఆయన సమర్పించిన "మీడియా స్టడీస్, డిజిటల్ కమ్యూనికేషన్ అండ్ కాంటెంపరరీ జర్నలిజం" పరిశోధన పత్రం ఉత్తమ పరిశోధన పత్రంగా ఎంపికై అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంది. అంతర్జాతీయ వేదికపై తన పరిశోధనా ప్రతిభతో కాకతీయ విశ్వవిద్యాలయ ఖ్యాతిని మరింత పెంచడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆధునిక మీడియా అధ్యయనాలు, డిజిటల్ కమ్యూనికేషన్ రంగాల్లో జరుగుతున్న పరిశోధనలు సమాజ అవసరాలకు అనుగుణంగా ఉండాలని, భవిష్యత్తులో మరిన్ని నాణ్యమైన పరిశోధనల ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విశ్వవిద్యాలయానికి మరింత గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ పరిశోధన పత్రం అవార్డు అందుకోవడం వ్యక్తిగత విజయమే కాకుండా కాకతీయ విశ్వవిద్యాలయ విద్యా, పరిశోధనా ప్రస్థానానికి గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం, ఓ ఎస్ డి ప్రొఫెసర్ వెంకట్రాంరెడ్డి, డాక్టర్ హరి కుమార్, రమేష్ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల విశ్వాసమే బాధ్యత పెంచింది



ప్రజాపక్షం/నెక్కొండ: నెక్కొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు సోమవారం హన్మకొండలో నర్సంపేట ఎంఎల్‌ఎ దొంతి మాధవరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్ల పదవీ కాలాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో వారు ఎంఎల్‌ఎను మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ రావుల హరీష్ రెడ్డి మాట్లాడుతూ తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రైతులకు మరింత చేరువయ్యే విధంగా సేవలు అందిస్తామని పేర్కొన్నారు. రైతుల సమస్యల పరిష్కారం, మార్కెట్ సదుపాయాల మెరుగుదల, పారదర్శక పాలనకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఎంఎల్‌ఎ దొంతి మాధవరెడ్డి నాయకత్వంలో నెక్కొండ మార్కెట్ అభివృద్ధి కృషి చేస్తామని పాలకవర్గ సభ్యులు తెలిపారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ మార్కెట్ కమిటీపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, మార్కెట్ డైరెక్టర్లు దువిమెట్ల కొమురయ్య, కొత్తపల్లి రత్నం, మహ్మద్ ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

## చట్టంపై అవగాహన కలిగి ఉండాలి



మండల పరిషత్ అభివృద్ధి అధికారి కూచన ప్రకాశ్

ప్రజాపక్షం/రాయపరి : పంచాయతీరాజ్ చట్టంపై వార్డు సభ్యులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కూచన ప్రకాష్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో సోమవారం ప్రారంభమైన వార్డు సభ్యుల మొదటి విడత ఐదు రోజుల శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు సభ్యులు ప్రతి ఒక్కరూ తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018 పై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. గ్రామ అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర అత్యంత కీలకమైందని, చట్టాలపై తమకు ఉన్న అధికారాలపై పట్టు సాధించినప్పుడే గ్రామాల్లో పారదర్శకమైన పాలన అందించడం సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం మాస్టర్ ట్రైనర్ బత్తుల నర్సయ్య మాట్లాడుతూ వార్డు సభ్యులు తమ పరిధిలోని ప్రజా సమస్యల పట్ల స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. స్థానిక సమస్యలను గుర్తించి వాటిని గ్రామసభల ద్వారా ఎలా పరిష్కరించుకోవాలో నిధులను ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలో ఈ 5 రోజుల శిక్షణలో వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఓటిలు పద్మనాభ స్వామి, విజేందర్, వివిధ గ్రామాల వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు రక్షణ కల్పించాలి



### దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి

ప్రజాపక్షం/నర్సంపేట : జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని, దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ తక్కళ్లపల్లి రవీందర్ రావు అన్నారు. నర్సంపేట పట్టణంలో సీనియర్ జర్నలిస్ట్ పాలంచ సత్యనారాయణపై జరిగిన దాడిని భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని, ఈ ఘటనపై మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సూచన మేరకు బిఆర్ఎస్ పార్టీ నాయకులు సత్యనారాయణను వారి స్వగృహంలో పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులపై ఇలాంటి భౌతిక దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికే ప్రమాదమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించి శాంతిభద్రతలను కాపాడాలని కోరారు. దాడి జరిగి నాలుగు రోజులు గడుస్తున్న ఇప్పటివరకు నిందితుని అరెస్టు చేయలేదని, ఈ ప్రభుత్వంలో ప్రభుత్వ అధికారులకు రక్షణ లేదని, జర్నలిస్టులకు రక్షణ లేదని, దాడులు నిత్య కృత్యంగా మారాయని విమర్శించారు. నర్సంపేట పట్టణంలో ఇలాంటి సంఘటన పట్ల పోలీసులు తక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు పట్టణ ప్రజలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర ఖనిజాలభివృద్ధి సంస్థ మాజీ డైరెక్టర్ నాడం శాంతి కుమార్, పార్టీ కౌన్సిలర్ మండల శ్రీదేవి శ్రీనివాస్, నాయకులు పెండెం శివానంద్, మోతే తిరుపతి రెడ్డి, బీరం నాగిరెడ్డి, నాడెం నగేష్, జగ్గారావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు

# మోడీ పాలనలో ప్రగతి పథంలో దేశం



ప్రజాపక్షం/ఖిలావరంగల్ : భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో దేశం అభివృద్ధిలో ప్రపంచంలోనే ముందంజలో ఉందని ఉప్పల్ మాజీ ఎంఎల్‌ఎ ఎన్‌విఎస్ ప్రభాకర్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాలన సంవత్సరాల పదవి కాలం పూర్తి చేసుకున్నందున వరంగల్ హంటర్ రోడ్డులోని శ్రీ కన్వెన్షన్‌లో బిజెపి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా ఉప్పల్ మాజీ ఎంఎల్‌ఎ ఎన్‌విఎస్ ప్రభాకర్ హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్ర ప్రభుత్వాలను పడగొట్టే విధంగా చర్యలు ఉంటాయన్నారు. బిజెపి ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క ప్రభుత్వాన్ని కూడా పడగొట్టిన దాఖాలాలు లేవని, నరేంద్ర మోడీ ప్రభుత్వంలో స్కిల్ ఇండియా, మేడిన్ ఇండియా స్వచ్ఛ భారత్, డిజిటల్ ఇండియా, పరిరక్షణ జాతీయ ఉద్యమాలుగా సాగాయన్నారు. పలు దేశ ద్రోహులు గుడులపై దాడులు చేస్తే, సంస్కృతిక అభివృద్ధి చేసే విధంగా అయోధ్య ఎవరు ఊహించని విధంగా పలు కార్యక్రమాలను చేపట్టారన్నారు. ఉగ్రవాదులను ఉగ్రవాద స్థానాలను లేకుండా చేసిన వ్యక్తి మోడీ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి అజ్మీర సీతారాం నాయక్, ఎంఎల్‌ఎ వన్నాల శ్రీరాములు, జిల్లా మీడియా ఇన్‌చార్జి దశమంత రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకటరమణ, ప్రోగ్రాం కన్వీనర్ కనుకుంట్ల రంజిత్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జలగం రంజిత్, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లాడి తిరుపతి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

# సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రజాపక్షం/ఖిలావరంగల్ : తెలంగాణ వీరబద్రియ కుల సంఘం వరంగల్ జిల్లా వీర భద్రియ కుల సంఘం ఎన్నికలు సోమవారం నిర్వహించారు. అధ్యక్షులుగా మల్లూరి రాజు, ప్రధాన కార్యదర్శిగా కందుకూరి సతీష్, కోశాధికారిగా మిట్టపల్లి రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుమలాపురం ఉప్పలయ్య, ఉపాధ్యక్షులు మల్లూరు బిక్షపతిని జిల్లా కమిటీగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వీరబద్రియ కుల సంఘం రాష్ట్ర నాయకులు కర్నే శివకుమార్, చెవ్వ రాజయ్య, మిట్టపల్లి చిన్న, రాజమౌళి, కాటి రాములు, మిట్టపల్లి సత్తయ్య, బాణాల రాజ్‌కుమార్, వరంగల్ పట్టణ సంఘం అధ్యక్షులు మిట్టపల్లి కుమారస్వామి, జనరల్ సెక్రటరీ కడారి చిరంజీవి, కోశాధికారి మిట్టపల్లి గంగరాజు, చెన్నారావుపేట సంఘం అధ్యక్షులు మిట్టపల్లి రాజు, కమలాపురం అధ్యక్షులు మల్లూరు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# భద్రకాళీ ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం



ప్రజాపక్షం/ఖిలావరంగల్ : వరంగల్ మహానగరంలో మూడు రోజుల పాటు జరపబడనున్న ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం సోమవారం ఉదయం ప్రారంభమైంది. దాతలు జారతి వెంకటేశ్వర్లు, గోపాల విజయ కుమార్, పుప్పాల శివశంకర్, మూల రాంమూర్తి, బొమ్మగాని కృష్ణమూర్తి, పురం సతీష్ కుమార్‌లు ఆలయానికి మేళతాళాలతో విచ్చేసి అమ్మవారి ఆజ్ఞ తీసుకున్నారు. అనంతరం పూర్వాంగ విధి నిర్వహించి యాగశాల ప్రవేశం చేశారు. సర్వతోభద్ర మండల ఇత్యాది మండలాలు రచించి దేవతాహ్వానం జరిపారు. తర్వాత మూలమంత్రానుష్టాన హోమాలు, కుటీల హోమం జరిపి జలాదివానం చేయడంతో మొదటి రోజు కార్యక్రమం పూర్తయ్యిందని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రముఖులలో కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి, ఎస్ఈ ఇరిగేషన్ హరివెంకటరామ ప్రసాద్‌లు తదితరులు ఉన్నారు. ఈ ధ్వజస్తంభ ప్రతిష్టకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను ఈవో రామల సునీత పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ డాక్టర్ బి శివసుబ్రహ్మణ్యమ్, ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, కటకం రాములు, గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్, మోత్కూరి మయూరి రామేశ్వర్‌రావు, గాండ్ల స్రవంతి, తొగరు క్రాంతి కుమార్, అనంతుల శ్రీనివాస్ భక్తులు పాల్గొన్నారు.

## హెచ్‌పివి వ్యాక్సిన్ తప్పనిసరి



### మాజీ కార్పొరేటర్ చింతాకుల అనిల్

ప్రజాపక్షం/ఖిలావరంగల్ : బాలికలకు హెచ్‌పివి వ్యాక్సిన్ తప్పనిసరిగా తీసుకోవాలని మాజీ కార్పొరేటర్ చింతాకుల అనిల్ అన్నారు. సోమవారం 27వ డివిజన్ మాజీ కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్ పుత్రిక చింతాకుల నైనికకు వ్యాక్సినేషన్ ఇప్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరంగల్ నగరంలోని సికెఎం ఆసుపత్రినందు 14 సంవత్సరాలు నిండిన బాలికలకు ప్రభుత్వం తరుపున అందిస్తున్న హెచ్‌పివి వ్యాక్సిన్ సికెఎం ప్రసూతి దవఖానలో ఉచితంగా అందుబాటులో ఉంచారని, డాక్టర్ ఎల్ దిలీప్ కుమార్ మెడికల్ ఆఫీసర్ పర్యవేక్షణలో ఇవ్వడం జరుగుతుందని అన్నారు. 14 సంవత్సరాలు నిండిన బాలికలు తప్పనిసరిగా ఈ వ్యాక్సిన్ వినియోగించుకుంటే భవిష్యత్తులో ఎలాంటి క్యాన్సర్ వ్యాధుల బారిన పడకుండా ఉంటారని దీనిని ప్రజలకు మరింత చేరువచేసి అవగాహన పెంచారని వైద్య సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎండి మసూద్ అలీ, ఏఎన్‌ఎం శశికళ, ఆశా వర్కర్లు తేజరాని, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

## కెనాల్ మాకొద్దు... ఒకటి ఉండగా మరోకెనాల్ ఎందుకు?



ప్రజాపక్షం/నర్సంపేట : కెనాల్ మాకు అవసరం లేదు అతి సమీపంలోనే మాకు కెనాల్ ఉండగా మరో కెనాల్ మాకొద్దు తద్వారా మా విలువైన భూములను కోల్పోతామని వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం కన్నరావుపేట రైతులు నర్సంపేట ఆర్డీవోకు వినతి పత్రం సోమవారం అందించారు. ఈ మేరకు కన్నారావుపేట సర్పంచ్ పలనాటి మూర్తి ఆధ్వర్యంలో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అయినప్పటికీ రైతుల భూములను చీల్చుతూ మరో కెనాల్ ఉందని నీటిపారుదల శాఖ అధికారులు పదేపదే చెప్పడం వల్ల భూములు పోతే జీవనోపాధి పోతుందని భయభ్రాంతులకు గురి కావాల్సి వస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో మా రైతుల కోరిక మేరకు కెనాల్ నిలుపుదల అయిందని మళ్లీ మూడేళ్ల తర్వాత మళ్లీ తెరపైకి రావడం భయభ్రాంతులకు గురిచేస్తుందని వారు వాపోయారు. రైతులను నష్టపరిచే కెనాల్ ను వెంటనే రద్దు పరచి రైతులు సుఖంగా, ప్రశాంతంగా జీవించుటట్లు అధికారులు చొరవ చూపాలని వారు ప్రాధేయపడ్డారు. ఈ కార్యక్రమంలో రైతులు నానబోయిన దేవేందర్, ఆశోద శరత్, కృష్ణారెడ్డి, సంపత్ రెడ్డి, రవీందర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, బద్రి, రాజేందేర్, యాకూబ్, దేవేందర్ రెడ్డి, సహదేవ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు

## 38వ సారి రక్తదానం చేసిన వరంగల్ పోలీస్ రాజు

ప్రజాపక్షం/ నర్సంపేట : వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని రాగంపేట గ్రామానికి చెందిన కన్నె కుమారస్వామి రామనీల దంపతులు పెద్ద కుమారుడు బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్ వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు) వరంగల్ పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో సిటీ ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నారు. యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ వారి ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారుల కోసం జూన్ 14, 2026 తేదీ ఆదివారం రోజున ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ సుబేదారి, హనుమకొండ లో మెగా రక్తదాన శిబిరం లో 38వ సారి రక్తదానం చేశారు. 38 సార్లు రక్తదానం చేసిన కన్నె రాజును వరంగల్ పోలీసు ఉన్నతాధికారులు, మిత్రులు, యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ సభ్యులు అభినందనలు తెలిపారు.

## అంగన్వాడీ కేంద్ర నూతన విద్యార్థులకు ఘన స్వాగతం

ప్రజాపక్షం /కొండాపూర్ : కొండాపూర్ మండల పరిధిలోని గొల్లపల్లి అంగన్వాడీ కేంద్రంలో నూతనంగా చేరే విద్యార్థులకు అంగన్వాడీ టీచర్ అరుణ పూర్వ విద్యార్థులతో కలిసి చిన్నారులకు పూలబుకేలను అందించి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా టీచర్ అరుణ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో చేరిన విద్యార్థులకు పౌష్టికాహారం ఆట పాటలతో పాటు వారికి అర్థం అయ్యేలా మంచి విద్యను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు ,వారి తల్లులు, ఆయా, పాల్గొన్నారు.

## ఇటిక్యాల ఆయుర్వేద వైద్యాధికారిగా కేదారి బధ్యతల స్వీకరణ

ప్రజాపక్షం/జగదేవ్‌పూర్: జగదేవ్‌పూర్ మండలంలోని ఇటిక్యాల ఆయుర్వేద వైద్యాధికారిగా డాక్టర్ కేదారి సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీలలో ఇక్కడ పని చేసిన దీపంజలీ చిన్న కోదూరు మండలం అల్లిపూర్‌కు బదిలీ అయ్యారు. ఆమే స్థానంలో ఆదిలాబాద్ జిల్లా బోద్ మండలం సోనాల గ్రామ ఆయుర్వేద కేంద్ర వైద్యాధికారిగా పని చేసిన కేదారి ఇటిక్యాలకు బదిలీపై వచ్చారు.

## కాంగ్రెస్ ఆశ చూపించి ప్రజలను మోసం చేసింది

మాజీ మంత్రి బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు



ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక అమలులో పూర్తిగా గాడి తప్పిందని, అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని కాంగ్రెస్ నాయకుల మాటలు కోటలు దాటుతున్నా, చేతలు మాత్రం గడప దాటడంలేదని మాజీ మంత్రి బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ధ్వజమెత్తారు. సిద్దిపేట జిల్లా చిన్నకోదూరు మండలం శంకరాకుంట గ్రామంలో బాలవికాస్ వాటర్ ప్లాంట్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు 4 వేల పెన్షన్, మహిళలకు 2,500 అలాగే రైతుబంధు15వేలను నెరవేర్చలేదని ఆరోపించారు. శంకరాయకుంట గ్రామ అభివృద్ధికి తెలిపారు. ఈకార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తులు లేక మూగ బోయిన ప్రజావాణి

ప్రజాపక్షం/అల్లాదుర్గం: ప్రజా సమస్యలను పరిష్కరించే ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో దరఖాస్తులు లేక మూగబోయిన ప్రజావాణి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ఎలాంటి దరఖాస్తులు రాలేవని తహసిల్దార్ మల్లయ్య ఇన్చార్జి ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని దీన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలి

మండల విద్యాధికారి శంకర్, సర్పంచ్ తులసీ సత్యనారాయణ



ప్రజాపక్షం /సంగారెడ్డి : వేసవి సెలవుల అనంతరం జిల్లా వ్యాప్తంగా 20262027 విద్యా సంవత్సరంనకు సోమవారం నుండి పాఠశాలలు తెరచుకున్నాయి. సదాశివ మండలంలోని నిజాంపూర్ కాలనీ పాఠశాలను కొబ్బరి ,మామిడి తోరణాలతో అందంగా అలంకరించారు. ఉపాధ్యాయులు గులాబీ పూలతో ,మిఠాయిలతో విద్యార్థుకు స్వాగతం పలికారు. పాఠశాల తెరిచిన మొదటి రోజునే విద్యార్థులకు సర్పంచ్ జోరీగల తులసీ సత్యనారాయణ ,ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల విద్యాధికారి శంకర్ చేతుల మీదుగా పాఠ్యపుస్తకాలు ,వర్క్ పుస్తకాలు , నోట్ పుస్తకాలు అందించారు. విద్యార్థులకు అక్షయ పాత్ర భోజనాన్ని వడ్డించారు.అనంతరం సర్పంచ్ ,మండల విద్యాదికారి శంకర్ కలసి పాఠశాల తరగతి గదులు మూత్రశాలలు ,మధ్యాహ్న భోజనం పాఠశాల ఆవరణాన్ని పరిశీలించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ పాఠశాల ప్రారంభం తొలి రోజునే పాఠశాలకు విద్యార్థులకు కావలసిన అన్ని రకాల వసతులు కల్పించి ఆహ్లాదకరమైన పాఠశాల వాతావరణాన్ని కల్పించినందుకు ,గత సంవత్సరం లో పాఠశాలను అన్ని రంగాలలో ముందు వరుసలో ఉంచినందుకు ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ ను అన్ని విషయాలలో సహాయ సహకారాలు అందించిన మండల విద్యాధికారి శంకర్‌ను, ఉపాధ్యాయులను ఈ సందర్భంగా అభినందించారు. మండల విద్యాధికారి శంకర్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు కూడా బడి బాటలో పాల్గొని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విధంగా కృషి చేసి ప్రభుత్వం విద్యార్థులకు వసతులను ఉపయోగించుకోవాలని కోరారు. అనంతరం ఉపాధ్యాయుల బోధనను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తులసి సత్యనారాయణ ,మండలవిద్యాధికారి శంకర్, ప్రదానోపాధ్యాయులు సుగుణమ్మ తల్లిదండ్రులు ,విద్యార్థులు పాల్గొన్నారు

# మహిళా పోలీసు స్టేషన్ ,సెంట్రల్ క్రైమ్ స్టేషన్ ఆకస్మిక తనఖీ



ప్రజాపక్షం /సంగారెడ్డి : సంగారెడ్డి మహిళా పోలీసు స్టేషన్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ పరిసరాల పరిశుభ్రత సిబ్బంది బ్యాంక్ స్టేషన్ రికార్డుల నిర్వహణ పెండింగ్ కేసుల స్థితిగతులను పరిశీలించారు. అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న కేసులను సమీక్షించిన ఎస్పీ ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించి బాధితులకు అండగా నిలవాలని అన్నారు. ఫిర్యాదు నమోదు నుంచి చార్జిషీట్ దాఖలు వరకు ప్రతి వివరాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఎప్పటి కప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. అలాగే నిర్ణీత గడువులోగా దర్యాప్తు పూర్తి చేసి నిందితులను న్యాయస్థానం ముందు హాజరు పరచాలని తెలిపారు. మహిళలపై జరుగుతున్న వివిధ రకాల నేరాలు పోక్సో చట్టం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలన్నారు. అనంతరం సులభంగా పారదర్శకంగా పోలీసు సేవలు అందేలా ప్రతి అధికారి బాధ్యతయుతంగా పనిచేయాలన్నారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా మాట్లాడాలని వారి సమస్యలను ఓపికగా విని వారి సమస్యకు పరిష్కారం చూపుతామని భరోసా కల్పించాలని అన్నారు. ఈ తనిఖీలో సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్యగౌడ్, మహిళా పోలీసు స్టేషన్ ఎస్ హెచ్ ఓ మహేష్ గౌడ్ ,సీసీఎస్ ఇన్స్పెక్టర్ శివకుమార్, ప్రసాద్ రావు, ఎస్ఐ మాణిక్ రెడ్డి, మహిళా ఎస్ఐ పూల బాయ్,, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అధ్వానంగా మారిన డ్రైనేజ రోడ్ల దుస్థితిపై తక్షణమే చర్యలు చేపట్టాలి

ఉపకమీషన్‌కు అసోసియేషన్ సభ్యులు



ప్రజాపక్షం /రాంచంద్రాపురం : అమీన్ పూర్ సాయి రాజేశ్వరి కాలనీ ఫేజ్ 1 అధ్వాన్నంగా మారిన డ్రైనేజ్ రోడ్ల దుస్థితి పై తక్షణమే చర్యలు తీసుకోవాలని అమీన్ పూర్ పీపుల్స్ అసోసియేషన్ సభ్యులు ఉప కమీషనర్ ప్రదీప్ కుమార్ ను కలిసి కోరారు. అమీన్పూర్ మున్సిపల్ సర్కిల్ పరిధిలోని సాయి రాజేశ్వరి కాలనీ ఫేజ్1 లో నెలకొన్న తీవ్రమైన డ్రైనేజ్ సమస్య అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్డ పనులపై అమీన్‌పూర్ పీపుల్స్ అసోసియేషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ కాలనీ నివాసితులు ఎదుర్కొంటున్న సమస్యలపై వివరిస్తు సోమవారం నాడు మున్సిపల్ డిప్యూటీ కమీషనర్‌కు అసోసియేషన్ ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా కాలనీలో ప్రధాన రహదారి నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడంతో పాటు డ్రైనేజ్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తూ మురుగునీరు. రోడ్లపై నిలిచిపోవడమే కాకుండా నేరుగా ఇళ్లలోకి ప్రవహిస్తుండటంతో స్థానికులు తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో ఈ సమస్య మరింత జటిలంగా మారింది. రోడ్లన్నీ బురదమయంగా మారి కనీసం నడవడానికి కూడా వీల్లేకుండా తయారయ్యాయి. అని ఓపెన్ డ్రైనేజ్ నిలిచిపోయిన నీటి కారణంగా ముఖ్యంగా మహిళలు ,చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు రావడానికి భయపడుతున్నారు. వర్షాలు గనుక భారీగా కురిస్తే ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడుతుందని మహిళల రక్షణ భద్రతకు తీవ్ర ముప్పు పొంచి ఉందని కాలనీ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు స్పందించి తక్షణమే కాలనీని సందర్శించాలని వారు కోరారు. రాబోయే వర్షాల వల్ల కాలనీవాసులు, మరిన్ని ఇబ్బందులు పడకుండా యుద్ధప్రాతిపదికన డ్రైనేజ్ లైన్లను బాగు చేయాలని రోడ్ల పనులను పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్ పూర్ పిపుల్స్ అసోసియేషన్ సభ్యు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త విద్యా సంవత్సరాన్ని ప్రారంభిస్తున్న విద్యార్థులకు శుభాకాంక్షలు

ప్రజాపక్షం /కొండాపూర్ : మండల పరిధిలోని గుంతపల్లి పాఠశాలలో కొత్త విద్యా సంవత్సరాన్ని ప్రారంభిస్తున్న విద్యార్థులకు ,ఉపాధ్యాయులకు గ్రామ సర్పంచ్ పడమటి అనంతరెడ్డి హృదయ పూర్వకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పడమటి అనంతరెడ్డి మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరంలో అడుగుపెడుతున్న విద్యార్థులు భక్తి శ్రద్దలతో ,క్రమశిక్షణతో ఉపాధ్యాయులను గౌరవిస్తూ శ్రద్ధతో చదువు కొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులకు కూడా విద్యార్థుపై ప్రత్యేక శ్రద్ధలతో ,క్రమశిక్షణతో ఉపాధ్యాయులను గౌరవిస్తు శ్రద్ధతో చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థుపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి నాణ్యమైన విద్యను భోధించాలని కోరారు. పాఠశాలలోని ఏ సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని ఎల్లవేళలా తన సహకారం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు,ఉపాధ్యాయులు ,పంచాయతీ వార్డు సభ్యులు శ్రీపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అమావాస్య... అన్నదానంతో పుణ్య ఫలం సిద్ధిస్తుంది



ప్రజాపక్షం/గజ్వేల్: అమావాస్య అన్నదానంతో పుణ్యఫలం సిద్ధిస్తుందని, పితృ దేవతలకు శాంతి కలుగుతుందని నాచగిరి శ్రీ లక్ష్మి నృసింహ ఆలయ కమిటీ అధ్యక్షులు పల్లెర్ల రవీందర్ గుప్త పేర్కొన్నారు. సోమవారం నాచగిరి క్షేత్రం వద్ద వర్గల్ మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేపట్టగా, మండల శాఖ అధ్యక్షులు వెంకటయ్య గుప్తతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. సేవా భావం, దాతృత్వం వైశ్యుల సొంతం కాగా, అన్నార్తుల ఆకలి తీర్చడానికి చేపట్టిన ఈ కార్యక్రమంతో దాతలు, సభ్యులు, ప్రతి ఒక్కరిపై స్వామి వారి సంపూర్ణ ఆశీస్సులు ఉంటాయని అన్నారు. ముఖ్యంగా ఆకలితో అలమటిస్తున్న వారి కడుపు నింపడం ఎంతో సంతృప్తి నిస్తుందని చెప్పారు. ప్రతి అమావాస్యకు చేపట్టనున్న అన్న ప్రసాద పంపిణీ నిర్విఘ్నంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుడాల వేణు గోపాల్ గుప్త, మండల శాఖ మాజీ అధ్యక్షులు పెద్ది విశ్వనాథం గుప్త, యువజన విభాగం అధ్యక్షులు గౌరీ శంకర్ గుప్త, మండల శాఖ బాధ్యులు, ఆర్యవైశ్య మహాసభ నాయకులు అమర బాలేష్ గుప్త, బచ్చు పవన్ గుప్త, చిట్టారి లక్ష్మి నర్సయ్య గుప్త, మాలే శ్రీనివాస్ గుప్త, ఆంజనేయులు గుప్త, రామిని రాజు గుప్త, నర్సింలు గుప్త, పెద్ది నరేష్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలులో... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

ప్రజాపక్షం/గజ్వేల్: హామీల అమలులో కేంద్రం లోని బిజెపి సర్కార్, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు విఫలమైనట్లు రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి విమర్శించారు. మక్త మాసన్ పల్లికి చెందిన ఆయా పార్టీల శ్రేణులు సోమవారం ప్రతాప్ రెడ్డి నేతృత్వంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసమర్థ విధానాల ఫలితంగా ప్రధాని నరేంద్ర మోడీ దేశాన్ని దివాలా తీయించగా, సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసినట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో యువత, మహిళలు, రైతులు, కార్మికులు కేసీఆర్ నాయకత్వం వైపు చూస్తున్నట్లు స్పష్టం చేశారు. రైతులను ఆదుకోవడంలో బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు విఫలం చెందడంతో ఎరువులు దొరకడం లేదని, పండించిన పంటలు కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. నమ్మి ఓటేసిన పాపానికి బిజెపి ఎంపీలు అన్ని వర్గాలను నట్టేట ముంచినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షులు బెండ మధు, గ్రామ సర్పంచ్ మహమ్మద్ ఫహీం, ఉపసర్పంచ్ రాకల వెంకటేష్, మాజీ సర్పంచ్ శాతం రజిత వెంకటేష్, గ్రామ కమిటీ అధ్యక్షులు శాతం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే పూజలు

**ప్రజాపక్షం/మెదక్ :** అయ్యప్పస్వామి దేవాలయ రజతోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం మహాగణపతి పూజ వైభవంగా జరిగింది. పుణ్యాహవాచనం, అఖండ దీపస్థాపన శివానందలహరి పారాయణం నిర్వహించారు. సాయంత్రం మహాలింగార్చన, ప్రదోష పూజ చేపట్టారు. రెండవరోజు భక్తిశ్రద్ధలతో హోమం, ధ్వజారోహణం నిర్వహించగా వేదపండితులు సామవేద పారాయణం పఠించారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ఆలయంలో అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సేవకుడు వైద్య రాజు, బాధ్యులు ఎమ్మెల్యేను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక, వైస్ చైర్మన్ నరేష్ గౌడ్, నాయకులు అశోక్, అష్టకాల విద్యామనోహర్ శర్మ, ఆలయ పూజారి అశోక్, బాధ్యులు వీర్ కుమార్, చక్రపాణి, కొండ శ్రీనివాస్, గంగ లక్ష్మి పతి, రమేశ్, శ్రీకాంత్ రెడ్డి, యచం చిన్న రాజు, వెంకట్ నారాయణ, ప్రభు గౌడ్, పార్థివనాథ్ పాల్గొన్నారు

## నీటి కొరత లేకుండా చూసుకుంటాం :ఎఇ

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండలంలోని బచ్చురాజ్ పల్లి గ్రామంలోని ఎంపీ యుపిఎస్ పాఠశాలను సోమవారం సందర్శించామని మిషన్ భగీరథ ఏఈ బిక్షపతి అన్నారు. పాఠశాలలో గల తాగునీటి వసతులను మరియు నల్లాలను, సంపును ఓవర్ హెడ్ ట్యాంకును పరిశీలించడం జరిగింది. పాఠశాలలో ఎటువంటి త్రాగునీటి ఎద్దడి లేకుండా ఉండడానికి తగిన సూచనలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాము పాఠశాల బృందం అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

## పచ్చని తోరణాలతో స్వాగతం ఆటపాటలతో పాఠశాల ప్రారంభం

**ప్రజాపక్షం/రేగోడు :** ప్రభ్వుత పాఠశాలలో పచ్చని తోరణాలతో బెలూన్లు ఏర్పాటు చేసి విద్యార్థులకు మొదటి రోజు ఆటపాటలతో సాగింది సోమవారం వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ పాఠశాలలో పున ప్రారంభం అయ్యాయి రేగోడ్ మండలంలో 21ఉన్నత పాఠశాలలో రెండు ఉన్నత ప్రాథమిక పాఠశాలలో 4 ఉన్నత పాఠశాలలో కస్తూర్బా బాలికల విద్యాలయం పున ప్రారంభం అయ్యాయి మండలం లోని టీ లింగంపల్లి పాఠశాలలో పచ్చని తోరణాలతో స్వాగతం పలికారు కస్తూర్బా బాలికల విద్యాలయం విద్యార్థులకు చాక్లెట్లు స్వీట్లు పంచారు మొదటి రోజు అన్ని పాఠశాలలు పున ప్రారంభమయ్యాయని ఎంఈఓ గురునాథ్ తెలిపారు

## బగలాముఖి శక్తిపీఠంలో సోమావతి అమావాస్య పూజలు



**ప్రజాపక్షం/శివ్వంపేట :** మండల కేంద్రమైన శివ్వంపేటలోని శ్రీబగలాముఖి శక్తిపీఠంలో సోమవారం అమ్మవారి ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో సోమవతి అమావాస్య పూజలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ పుష్పాలతో అలంకరించి మహామంత్ర హోవనము, మహాపూజ, పంచామృతాలతో అభిషేకం, పూర్ణాహుతితో పాటు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు స్థానిక భక్తులతో పాటు వివిధ రాష్ట్రాల భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. పెద్ద ఎత్తున హాజరైనన భక్తులకు శక్తిపీఠం స్థలదాత పబ్బ రమేశ్‌గుప్తా ఆధ్వర్యంలో మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తా కుటుంబీకుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టు సభ్యులు శాస్త్రుల పురుషోత్తమశర్మ, వెంకటరమణశర్మ, జిన్నారం పెద్దగౌని శివకుమార్‌గౌడ్, పబ్బ మహేశ్‌గుప్తా, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రమణాగౌడ్, సర్పంచ్ రాజిపేట వెంకటేశ్వర్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, ఉపసర్పంచ్ ఇసుగారి మల్లేశ్, బాసంపల్లి పోచాగౌడ్, లక్ష్మి నర్సయ్య, పీఎంజీ యువసేన సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ధూల్మిట్ట ప్రభుత్వ పాఠశాల రాష్ట్రానికే ఆదర్శం...”

### ప్రభుత్వ పాఠశాలలో నూతన విద్యా సంవత్సరం సందడి... విద్యా వెలుగులకు ఘన స్వాగతం



**ప్రజాపక్షం/మద్దూరు/ధూల్మిట్ట :** అద్భుత ఫలితాలు, వినూత్న బోధన, విద్యార్థుల ప్రతిభ వికాసానికి కృషి చేస్తూ ధూళిమిట్ట ప్రభుత్వ పాఠశాల ప్రభుత్వ విద్యకు ప్రతిష్టాత్మక చిహ్నంగా,విజయాలకు చిరునామాగా ధూల్మిట్ట ప్రభుత్వ పాఠశాల రాష్ట్రానికి ఆదర్శ విద్యాలయంగా ఎదుగుతోంది. ప్రభుత్వ పాఠశాలలు కూడ ప్రైవేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోవని నిరూపిస్తూ, వరుస విజయాలతో విద్యారంగంలో అద్భుత ఫలితాలు సాధిస్తోంది. ఉపాధ్యాయుల అంకిత భావంతో వినూత్న బోధన, విద్యార్థుల కృషితో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ధూల్మిట్ట ప్రభుత్వ పాఠశాల ఉత్తమ ఫలితాలు సాధిస్తోందని. రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తుందని ధూల్మిట్ట గ్రామ సర్పంచ్ గునుకుల లీల జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభాన్ని పురస్కరించుకుని ధూల్మిట్ట మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనుముల కర్ణాకర్‌రెడ్డి సోమవారం ఘనంగా స్వాగతోత్సవ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఆవరనను మామిడి ఆకుల తోరణాలు, రంగురంగుల బెలూన్లు, పుష్పాలతో సుందరంగా అలంకరించి విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలికారు. పాఠవాలకు వచ్చిన విద్యార్థులకు పూలు అందించి ఆహ్వానించడంతో వారి ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గునుకుల లీల జగన్‌మోహన్ రెడ్డి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ నాచగోని పావణి లక్ష్మి కిష్టయ్య, ముఖ్య అతిధులుగా, ప్రత్యేక అతిధిగా ప్రజాపక్షం మండల ప్రతినిధి కొండూరి సతీష్ కుమార్ హాజరై విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త విద్యా సంవత్సరాన్ని ఉత్సాహంగా ప్రారంభించిన విద్యార్థులు ఉన్నత లక్ష్యాల సాధన దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనుముల కర్ణాకర్‌రెడ్డి మాట్లాడుతూ మొన్న ప్రకటించిన ట్రిపుల్ ఐటి ఫలితాల్లో ఈ పాఠశాల నుండి ముగ్గురు విద్యార్థులు ఎంపిక కావడం, అలాగే గత మూడు సంవత్సరాలుగా నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష ఫలితాల్లో ఇదే పాఠశాల జిల్లా స్థాయిలో చక్కని ప్రతిభను కనబరిచి, పలువురు విద్యార్థులు అర్హత సాధించినట్లు, పాఠవాలలో 100 శాతం ఉత్తీర్ణతతో పాటుగా అత్యుత్తమ మార్కులు సాధించడం ధూల్మిట్ట పాఠశాల విద్యా ప్రమాణాలకు నిదర్శనమని ప్రధానోపాధ్యాయులు అనుముల కర్ణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందంతో పాటుగా విద్యార్థులు పాల్గోన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల పనితీరుకు కాటాపూర్ ఫలితాలే నిదర్శనం

### డిఈఓ సిద్దార్థ రెడ్డి



**ప్రజాపక్షం/ములుగు:** ప్రభుత్వ పాఠశాలల ప్రారంభం సందర్భంగా డిఈఓ సిద్దార్థ రెడ్డి జడ్పిహెచ్ఎస్ కాటాపూర్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సుధాకర్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు చాలా చక్కగా పనిచేస్తున్నాయని అంకితభావం కలిగిన ఉపాధ్యాయుల కృసి చాలా బాగుందని అందుకు జడ్పిహెచ్ఎస్ కాటాపూర్ పాఠశాలలో నుండి ముగ్గురు ఐఐఐటి బాసరలో సీటు సాధించడం 100 శాతం ఫలితాలు నమోదు చేయడం ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో దాదాపు 60 కొత్త అడ్మిషన్లు రావడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ సుధాకర్‌ను ఉపాధ్యాయ బృందాన్ని డిఈఓ అభినందించారు. సైన్స్ ప్రయోగాత్మకంగా బోధించాలని నిజ జీవితంలో అన్వయించుకునేలా బోధించాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ సందర్భంగా ఉర్దూ మీడియం పాఠశాలలో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాటాపూర్‌లో కొత్తగా చేరిన విద్యార్థులకు డిఈఓ అడ్మిషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఎంఓ శ్యాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ కాటాపూర్‌లో ప్రాథమిక, జడ్పిహెచ్ఎస్, ఉర్దూ మీడియం పాఠశాలల నుండి దాదాపు 100 అడ్మిషన్ల వరకు రావడం చాలా సంతోషం, అభినందనీయమని ప్రశంసించారు. అనంతరం ఎంఈఓ గడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ కాటాపూర్ పాఠశాలలో విద్యార్థులు కష్టపడి చదవడం, వారికి ఉపాధ్యాయుల గైడెన్స్ ఇవ్వడం, తల్లిదండ్రులు, గ్రామం నుండి సర్పంచ్‌గా తన వంతు సహకారం అందిస్తానని అలాగే ప్రభుత్వం తరుపు నుండి డిఈఓ పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఏఏపిసి చైర్‌పర్సన్, సర్పంచ్ దిడ్డి మోహన్‌రావు, ఉప సర్పంచ్ వెంకట నరసయ్య, ఉపాధ్యాయులు సక్రు, రాజేష్, శాంసన్, విజయ, గ్రామ ప్రజలు, తల్లిదండ్రులుతల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాయిన్‌పల్లి ప్రాజెక్టు మరమ్మతులు వెంటనే చేపట్టాలి

### రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి కలక్టరేట్ ముందు బిఆర్ఎస్ ధర్నా, కలెక్టర్ కు వినతిపత్రం అందజేత

మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/మెదక్ :** రాయిన్‌పల్లి ప్రాజెక్టు హై లెవల్ కాల్వ, లో లెవల్ దోని మరమ్మతులను వెంటనే చేపట్టి రైతులకు సాగునీరు అందించాలని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మెదక్ కలెక్టరేట్ ముందు బీఆర్ఎస్ నాయకులు, రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. గత ఏడాది భారీ వర్షాలకు దెబ్బతిన్న హై లెవల్ కాల్వ, ధోనిని ఇప్పటికీ పునరుద్ధరించకపోవడంతో సుమారు 2500 ఎకరాల సాగు భూములకు నీటి సరఫరా నిలిచి పోయిందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. తిమ్మానగర్, మక్తా భూపతిపూర్, గుట్టకింది పల్లి, శివాయిపల్లి, వెంకటాపూర్ తదితర గ్రామాల రైతులు ఈ కాల్వపై ఆధారపడి ఉన్నారని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ కు వినతిపత్రం సమర్పించి, తక్షణ చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని పద్మా దేవేందర్ రెడ్డి కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ లావణ్య రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్లు బట్టి జగపతి, కృష్ణారెడ్డి, నాయకులు ఆంజనేయులు, అంజా గౌడ్, కిష్టయ్య, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పిఎసిఎస్ చైర్మన్ ఆర్థికసాయం



**ప్రజాపక్షం/శివ్వంపేట :** శివ్వంపేట మండలం కొంతాన్‌పల్లి గ్రామానికి చెందిన చాకలి మానెమ్మ అనారోగ్యంతో మృతిచెందగా విషయం తెలుసుకున్న మండల పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకటరాంరెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి రూ. 5వేల ఆర్థి క సహాయం అందజేశారు. ఆయన వెంట ఉపసర్పంచ్ బోళ్ల కుమార్, వార్డు సభ్యులు ఉప్పరి సంతోష్, సార శంకర్, గొల్ల నాగరాణియాదగిరి, చాకలి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో మెదక్ క్రీడాకారుల ప్రతిభ

### క్రీడాకారులను ప్రశంసించిన్న కలెక్టర్

**ప్రజాపక్షం/మెదక్ :** హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఈ నెల 11,12 తేదీల్లో నిర్వహించిన 12వ తెలంగాణ మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో మెదక్ జిల్లా క్రీడాకారులు పలు పతకాలు సాధించి ప్రతిభ చాటారు. పోటీల్లో అనిత 10 కిలోమీటర్ల పరుగులో తృతీయ స్థానం, శేఖర్ 3000 మీటర్ల పరుగులో మరియు 400 మీటర్ల హార్డిల్స్‌లో ద్వితీయ స్థానం, అశోక్, రవి నాలుగు సార్లు 400 మీటర్ల రిలేలో ద్వితీయ స్థానం సాధించారు. పతక విజేతలను జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు మరింత గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి రమేష్ గంగాల, అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అనుముల మధుసూదన్, కోచ్ అర్జున్ ఉన్నారు.

మైనారిటీ నూతన కమిటీ ఏర్పాటు

## అధ్యక్షుడిగా మాక్బూల్ అహ్మద్, కోశాధికారిగా లతీఫ్ ఏకగ్రీవ ఎన్నిక

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండలం కల్వకుంట గ్రామంలోని మైనారిటీల సంక్షేమం, సామాజిక అభివృద్ధికి మరింత సమర్థవంతంగా సేవలందించాలనే లక్ష్యంతో కల్వకుంట గ్రామ మైనారిటీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ పెద్దలు, యువకుల సమక్షంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడిగా మహమ్మద్ మాక్బూల్ అహ్మద్, కోశాధికారిగా ఎం డి లతీఫ్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామంలోని మైనారిటీ వర్గాల సమస్యల పరిష్కారం, యువతకు ప్రోత్సాహం, సంక్షేమ కార్యక్రమాల అమలులో చురుకైన పాత్ర పోషిస్తామని తెలిపారు. మైనారిటీ అభ్యున్నతికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అర్హులందరికి చేరేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. నూతన కమిటీ ఎన్నికపై గ్రామ పెద్దలు, యువకులు హర్షం వ్యక్తం చేస్తూ సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మైనారిటీ సంఘ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## ఆయిల్ ఫామ్ విస్తరనకు కృషి

### మాజీ మంత్రి హరీష్‌రావు

**ప్రజాపక్షం/సిద్దిపేట :** సిద్దిపేట నియోజకవర్గంలో ఈ ఏడిది 2వేల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ పంట సాగు లక్ష్యంగా పని చేయాలని మాజీ మంత్రి బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు అధికారులకు సూచించారు. సోమవారం సిద్దిపేట క్యాంపు కార్యలయంలో అయిల్ ఫెడ్, హార్టికల్చర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్బంగా హరీష్‌రావు మాట్లాడుతూ, ప్రస్థుతం 4,800ఎకరాల్లో 16 వందల మంది రైతులు అయిల్ ఫామ్ సాగు చేస్తున్నారని తెలిపారు. రైతులకు అవగాహన కల్పించి ఆయిల్ ఫామ్ పంట సాగువిస్తరణ పెంచాలని, మెగా ప్లాంటేషన్‌కు ప్రనాళికలు రూపొందించాలని సూచించారు. యాప్‌తో సంబంధం లేకుండా రైతులకు యూరియా అందించాలని, నీరు, ఎరువులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను హరీష్ రావు ఆదేశించారు.

## అలంకానిపేట చెరువు కట్ట మరమ్మతు పనుల ప్రారంభం

**ప్రజాపక్షం/నెక్కొండ:** రైతుల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ అలకానిపేట గ్రామ చెరువు కట్ట మరమ్మత్తుల కో సం మంజూరైన రూ.7లక్షల పనులను టిపిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఎంఎల్‌ఏ దొంతి మాధవరెడ్డి సూచనల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమం మండల కాంగ్రెస్ అధ్యక్షులు లావుడ్య తిరుమల్ చౌహాన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా రంజిత్ రెడ్డి మాట్లాడుతూ చెరువు కట్ట బలోపేతంతో సాగునీఇ సమస్యలు తగ్గడంతో పాటు భూగర్బ జలాలు పెరిగి రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమలో హరీష్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్, నిరోష శ్రావణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చెరువు కట్ట మరమ్మత్తులతో గ్రామ రైతాంగానికి ప్రయోజనం చేకూరనుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# రైతన్నలో ఆనందం, కానీ తొందరపాటు వద్దు :నిపుణులు

**ప్రజాపక్షం/గూడూరు:** గత మూడు నాలుగు నెలలుగా భానుడి భగభగలతో అల్లాడిపోయిన ప్రజలకు రైతులకు తొలకరి జల్లుల ఊరటనిచ్చాయి. ఇటీవల కురిసిన స్వల్ప వర్షంతో గూడూరు మండల వ్యాప్తింగా వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.ముండుతున్నెండలతో వేడెక్కిన నేలపై వర్షపు చినుకులు పడటంతో ప్రకృతి సరికొత్త అందాలను సంతరించుకుంది. ఖరీఫ్ సీజన్‌కు సిద్దమవుతున్న రైతాంగంలో ఈ వర్షాలు కొత్త ఆశలను నింపాయి.మండలంలోని 41 గ్రామాలు గూడూరు మండల కేంద్రంలోని 14 వార్డుల పరిధిలో రైతులు ఇప్పటికే పోలాల శుభ్రపరిచే పనులు దుక్కి పనులకు సన్నాహాలు చేపట్టారు. తొలకరి జిల్లులు కురవడంతో వ్యవసాయ పనులు ప్రారంభించేందుకు రైతులు ఉత్సాహం చూపుతున్నప్పటికీ వాతావరణ పరిస్థిలులపై కొంత ఆందోళన కూడా వ్యక్తం చేస్తున్నారు.

**వర్షాలపై అనిశ్చితి.. రైతుల్లో సందిగ్ధం**



ఐఎండి హెచ్చరికలతో ఎల్ నివో ప్రభావంతో ఈ సంవత్సరం పూర్తి స్థాయిలో వర్షాలు కురుస్తాయా లేదా అనే సందేహం రైతుల్లో నెలకొంది. ప్రస్తుతం కురిసిన వర్షాలు స్వల్పంగా ఉండటంతో కొందరు రైతులు వెంటనే సాగు పనులు ప్రారంభించేందుకు సిద్దమవుతుండగా వ్యవసాయ నిపుణులు మాత్రం మరికొన్ని మంచి వర్షాలు కురిసిన తర్వాతే ప్రధాన పంటల సాగు ప్రారంహించాలని సూచిస్తున్నారు.

**నీల స్వరూప పోనుగోడు గ్రామానికి చెందిన మహిళ రైతు**



మరిన్ని వర్షాలు కురిస్తేనే దైర్యంగా సాగు చేస్కువచ్చని మహిళ రైతు నీల స్వరూప తెలిపారు. ఈసందర్బంగా ఆమే మాట్లాడుతూ తొలకరి జల్లులు పడటంతో రైతులకు కొంత ఊరట అభించింది. అయితే గతంలో కూడా ప్రారంభంలో వర్షాలు కురిసిన తర్వాత ఎండలు పెరిగిన సందర్బాలు ఉన్నానయి. మరికోన్ని మంచి వర్షాలు కురిసిన తర్వాతే ప్రధాన పంటలు వేయడం మంచిదని భావిస్తున్నాం ప్రస్తుతం పోలాల సిద్దత పనులు మాత్రమే చేపడుతున్నాం అని మహిళ రైతు నీ ల స్వరూప తెలిపారు.

**ఆశలున్నా జాగ్రత్త అవసరం రైతు పింగిలి వెంట్‌రెడ్డి రైతు**

ఆశలున్నా జాగ్రత్త అవసరం అని రైతు పింగిలి వెంట్‌రెడ్డి అన్నారు. ఈసందర్బంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ కోసం రైతులు ఎంతో ఆసక్తింగా ఎదురుచూస్తున్నారు.తొలకరి జల్లులు ఆనందాన్ని ఇచ్చినా పూర్తి స్థాయిలో వర్షాలు కురవకపోతే పంటలు నష్టపోయే అవకాశం ఉంది.అందుకే వాతావరణ పరిస్థితులను గమనిస్తూ ముందుకు వెళ్లాలి రైతులు తొందరపడి విత్తనాలు వేయకుండా కొంత వేచి చూడడం మంచిది. అని అభిప్రాయపడ్డారు.

**జిలుగు విత్తనాలు ఉపయోగించాలివ్యవ-సాయ శాఖ అధికారి అబ్దుల్ మాలిక్**



జిలుగు విత్తనాలు ఉపయోగించుకోవాలని గూడూరు మండల వ్యవసాయ శాఖ అధికారి అబ్దుల్ మాలిక్ అన్నారు. ఆయన మాట్లాడుతూ రైతులకు పలు సూచనలు చేస్తున్నారు. జిలుగు (ధైదచా) విత్తనాలు నాటాలని గూడూరు మండల రైతులకు సూచిస్తున్నారు.తొలకరి జల్లులుకే ప్రధాన పంటల విత్తనాలు వేయకుండా ముందుగా జిలుగు ధైంచా విత్తనాలు నాటాలని సూచిస్తున్నారు. జిలుగును పచ్చిరొట్టి ఎరువుగా మార్చుకోవగం ద్వారా భూమి సారాన్ని పెంచుకోవచ్చని తెలిపారు.ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులు అలోచించి నిర్ణయం తీసుకోవాలని ప్రస్తుతం జిలుగు విత్తనాలు వ్యవసాయ శాఖ కార్యలయంలో అందుబాటులో ఉన్నాయి.వాటిని ఉపయోగంచడం ద్వారా రసాయన ఎరువుల వినియోగం తగ్గి భూమిలో సేంద్రియా పదార్థాల శాతం పెరుగుతుంది. వరుసగా మంచి వర్షాలు కురిసిన తర్వాతతే ప్రధాన పంటల సాగుకు రైతులు సిద్ధం కావాలి అని సూచించారు.

**ఖరీఫ్ ఆశలు కొత్త ఊపు**

తొలకరి జల్లులు చెట్లు మొక్కలు తడిసి ఎండ తీవ్రత తగ్గడంతో ప్రజలు ఉపశమనం పోందారు. గ్రామీణ ప్రాంతాల్లో పిల్లులు వర్షంలో ఆడిపాడుతూ ఆనందం వ్యక్తం చేయగా రైతులు పోలాల వద్దకు వెళ్లి పరిస్థితులను పరిశీలించారు. వ్యవసాయధారిరిత ప్రాంతమైన గూడూరు మండలంలో ఖరీఫ్ సీజన్‌కు ఈ తొలకరి జల్లులు శభసూచకంగా మారాయని రైతులు పేర్కోవటున్నారు. అయితే ఆశతో పాటు అప్రమత్తత కూడా అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. మరిన్ని వర్షాలు కురిసి పంటల సాగుకు అనుకూల వాతావరణం నెలకొనాలని రైతాంగం ఆకాంక్షిస్తోంది.

## అఖిల భారత రైతు కూలీ సంఘం మహాసభలను జయప్రదం చేయండి



**పజాపక్షం/ములుగు:** ఈ నెల 18వ తేదీన నర్సంపేట పట్టణంలో జరుగు ఉమ్మడి వరంగల్ జిల్లా అఖిల భారత రైతు కూలి సంఘం ఏఐకేఎంఎస్ మహాసభలను జయప్రదం చేయాలని ములుగు పట్టణ కేంద్రంలో రైతు కూలీ సంఘం నాయకులు సోమవారం కరపత్రం ఆవిష్కరించారు. ఈ మహాసభకు సంఘం అధ్యక్షులు జక్కుల తిరుపతి అధ్యక్షత వహిస్తారని ముఖ్య అతిధులుగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు మామిడాల బిక్షపతి, ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎలకంటి రాజేందర్, ఐఎఫ్‌టియూ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంగుల దయాకర్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గట్టి కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి పూలక్క తదితరులు మాట్లాడతారని వారు తెలిపారు. ఈ మహాసభలో ముందుగా గత రెండు సంవత్సరాల నుండి నేటి వరకు రైతు సమస్యలపై జరిగిన వివిధ ఆందోళన కార్యక్రమాల రిపోర్టు మాట్లాడడం ఉంటుందని, భవిష్యత్తు కార్యక్రమాల ఎంపిక జరుగుతుందని వారు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గం ఏర్పాటు కూడా ఉంటుందని వారు తెలిపారు. ఈ కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బొమ్మెడ సాంబయ్య, భూక్య లాలు, సమ్మయ్య, బోజియా బాలాజీ, శివ, పైడి, తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపు జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన మహేందర్‌కు సన్మానం



**ప్రజాపక్షం/జనగామ టౌన్, :** మున్నూరు కాపు జిల్లా నూతన అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన నల్గొండ మహేందర్‌ను సోమవారం చీటకోడూర్ రోడ్డులోని దేవిశ్రీ ఐరన్ షాప్ వద్ద మున్నూరు కాపు జిల్లా పరపతి సంఘం ఆద్వర్యంలో ఘనంగా సన్మానించారు. సంఘం అధ్యక్షుడు చామకూర యాకూబ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడు తూ మున్నూరు కాపుసామాజిక వర్గానికి ప్రభుత్వం తగిన ప్రాధాన్యం కల్పించాలని కోరారు. అలాగే కాచిగూడ మున్నూరు కాపు విద్యార్థుల వసతి గృహంలో 202627 ఈనెల 24లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు తోట సత్యం, శ్రీనివాస్, చిరంజీవి, శోభన్‌బాబు, శ్రీహరి, సంజీవ్, నాగరా జు, చంద్రమౌళి, సందీప్, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

## 70 ప్రైవేట్ కంపెనీలతో మెగా జాబ్ మేళా

### యూత్ మండల అధ్యక్షులు చింతక్రాంతి

**ప్రజాపక్షం/గొవిందరావు:** ములుగు జిల్లా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో జూన్ 17 న మెగా జాబ్ మే ళా నిర్వహించనున్నట్లు గోవిందరావుపేట యూత్ మం డల అధ్యక్షులు చింతక్రాంతి తెలిపారు రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క చొరవతో జిల్లా కలెక్టర్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ములుగు మండలం ఇంచర్ల గ్రామంలోని ఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఈ జాబ్ మేళా నిర్వహించబడనుంది ఈ మెగా జాబ్ మేళాలో సుమారు 70 ప్రైవేట్ కంపెనీలు పాల్గొననున్న నేపథ్యంలో ములుగు జిల్లా వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యు



వతి యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చింతక్రాంతి పిలుపునిచ్చారు యువతకు ఉ పాధి అవకాశాలు కల్పి ం చేందుకు మంత్రి సీత క్క చేస్తున్న కృషిని అభినందిస్తూ ఉద్యోగాలను సాధించి త మ కుటుంబాలకు అండగా నిలవాలని ఆయన సూచించారు విద్యార్హతలకు సం బంధించిన ధ్రువపత్రాలు బయోడేటా అవసరమై న పత్రాలతో జాబ్ మేళాకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

## వడ్డెరగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో బడిబాట కార్యక్రమం



**ప్రజిపక్షం/గోవిందరావుపేట:** తాడ్వాయి ప్రాజెక్టు పసర సెక్టార్ పరిధిలోని వడ్డెరగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని పున:ప్రారంభించి చిన్నారుల బంగారు భవిష్యత్తుకు అంగన్‌వాడీ విద్య ఎంతో కీలకమని అవగాహన కల్పించారు మన చిన్నారుల భవిష్యత్తు కోసం అంగన్‌వాడితోనే తొలి అడుగు అపే సందేశంతో తల్లిదండ్రులను చైతన్యపరిచారు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉచిత ప్రీ స్కూల్ విద్య పోషకాహార భోజనం ఆటల ద్వారా అక్షరభ్యాసం మంచి అలవాట్లు సామాజిక అభివృద్ధికి అవసరమైన శిక్షణ అందుతుందని వివరించారు సోమవారం నుంచి పాఠశాలలు ప్రారంభ ఆయన నేపథ్యంలో తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలకు పంపించాలని తల్లి దండ్రులకు విజ్ఞప్తి చేశారు అలాగే పాఠశాల అభివృద్ధికి సహకరిస్తూ విలువైన సూచనలు సలహాలు అందించాలని కోరారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు చిన్నారుల తల్లిదండ్రులు అంగన్‌వాడీ టీచర్ ఎస్ భాగ్యమ్మ ఆయా కల్పన ఆశా కార్యకర్త రమణమ్మ గర్భిణీలు బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ విద్యా, వైద్య దోపిడీపై మూడు నెలల పాటు సిపిఎం పోరాటాలు



**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** ప్రైవేట్ విద్యా, వైద్య రంగాలలో జరుగుతున్న దోపిడీతో పాటు స్థానిక సమస్యల పరిష్కారం కోసం రాబోయే మూడు నెలల పాటు సీపీఎం పార్టీ ఆద్వర్యంలో విస్తృత పోరాటాలు నిర్వహిస్తామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రంలో సీపీఎం జిల్లా కమిటి సభ్యులు సుంచు విజేందర్ అధ్యక్షతన మూడు రోజులుగా జరిగిన రాజకీయ శిక్షణ తరగతులు ముగిశాయి. ఈ సమావేశంలో కనకారెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ రంగ స్కూళ్లను ప్రోత్సహించాలని, ప్రభుత్వ ఆసుపత్రులలో వసతులను మెరుగుపరచాలని చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదిర్శవర్గ సభ్యులు రాపర్తి రాజు, సాంబరాజు యాదగిరి, శేఖర్, నాయకులు వెంకటేష్, గోపి, ప్రకాశ్, రమేష్, నరేందర్, సోమన్న, అజరుద్దీన్, రమేష్, సారయ్య, పాల్గొన్నారు.

# అమ్మమాట- అంగన్వాడీ బాట

ప్రజాపక్షం/ధర్మపురి : ధర్మపురి సెక్టారు లోని అంగన్వాడీ 4వ కేంద్రంలో సోమవారం అమ్మమాట అంగన్వాడీ బాట కార్యక్రమాన్ని సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ నాగలక్ష్మి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలలో పౌష్టికాహారంతో కూడిన విద్యను అందించడమే కాకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తోందని తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్వాడీ సెంటర్లో చేర్పించాలని సూచించారు.సెక్టార్ సూపర్వైజర్ స్వప్న మాట్లాడుతూ ప్రయివేటు స్కూల్ వద్దు అంగన్వాడీ ముద్దు అనే నినాదంతో పిల్లలను అంగన్వాడీ సెంటర్లో చేర్పించి వారి శారీరక,మానసిక ఎదుగుదలకు పాటు పడాలని కోరారు.అనంతరం అంగన్వాడీ టీచర్లు,విద్యార్థులతో పట్టణంలోని ప్రధాన రహదారుల గూండా ర్యాలీ నిర్వహించారు.

## పాఠశాలలు పునః ప్రారంభం

ప్రజాపక్షం /మల్లాపూర్ : వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు జూన్ 15 సోమవారం రోజున పునః ప్రారంభమయ్యాయి. కాగా ప్రభుత్వ పాఠశాలలకు విచ్చేసే విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠశాలను ప్రత్యేకంగా అలంకరించి వెల్కమ్ బోర్డులను ఏర్పాటు చేసి ఘనంగా స్వాగతం పలికారు. 45 రోజుల వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు విద్యార్థులతో సందడిగా మారాయి.

# ఉత్తమ పాత్రికేయ పురస్కార గ్రహీత బాసెట్టి హరీష్‌కు ఘన సన్మానం

ప్రజాపక్షం /మెట్‌పల్లి : ఇటీవల శ్రీకాళహస్తిలో తెలుగు జాతీయ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ పాత్రికేయ పురస్కారం అందుకున్న ప్రముఖ జర్నలిస్ట్ బాసెట్టి హరీష్‌ను యూత్ కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు పెంట ప్రణయ్, ఎన్ఎస్‌యుఐ పట్టణ అధ్యక్షుడు షేర్ భరత్, ఫిషర్‌మెన్ జిల్లా కమిటీ అధ్యక్షుడు పల్లికొండ ప్రవీణ్, గడప విమల్, జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు ఏశమేని గణేష్ తదితరులు హరీష్‌కు పూలమాలలు,శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.నాయకులు మాట్లాడుతూ జర్నలిజం రంగంలో బాసెట్టి హరీష్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు.

## భక్తుల ప్రత్యేక పూజలు

ప్రజాపక్షం/మల్లాపూర్: అతి పురాతన ఆలయంగా పవిత్ర కొండపైన వెలసిన శ్రీ కనక సోమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రోజున భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు అభిషేకార్చనలు జరిపించారు. ఉదయం నుండే భక్తులు కాలినడకన ఎత్తైన కొండపైకి చేరుకుని పవిత్ర కోనేటిలో పుణ్యస్నానాలు ఆచరించి సోమేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు కొండ కింద దాతల సహకారంతో ఆలయ కమిటీ సభ్యులు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన విద్యా సంవత్సరం ప్రారంభం



ప్రజాపక్షం /మెట్‌పల్లి : 2026–2027 నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థిని–విద్యార్థులందరికీ టిపిసిసి సీనియర్ నాయకులు, సుప్రీంకోర్టు అడ్వకేట్ కొమిరెడ్డి కరంచంద్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ మేరకు ఆయన సోమవారం హైదరాబాదు నుంచి చరవాణి ద్వారా మెట్‌పల్లిలోని స్థానిక విలేకరులతో మాట్లాడారు. వేసవి సెలవుల అనంతరం రాష్ట్రవ్యాప్తంగా విద్యాలయాలు తిరిగి ప్రారంభం కానున్నాయని పేర్కొంటూ, కొత్త విద్యా సంవత్సరంలో అమలు చేయనున్న పథకాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే సమీక్షించి అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.నాణ్యమైన విద్యా బోధన అందించేందుకు ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తోందని ఆయన అన్నారు. ఈ నేపథ్యం లో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు తప్పనిసరిగా హాజరయ్యేలా బాధ్యత వహించాలని కోరారు.తమ తల్లిదండ్రులు, మాజీ శాసన సభ్యులు స్వర్గీయ కొమిరెడ్డి రాములు, స్వర్గీయ జ్యోతక్క ఎమ్మెల్యే పదవీకాలంలో నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని ఆయన గుర్తు చేశారు. వారు విద్యా వ్యవస్థతో బలమైన అనుబంధం కలిగి ఉండి, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం నిరక్షరాస్యత నిర్మూలన లక్ష్యంగా గ్రామాల నుంచి పట్టణాల వరకు పాఠశాలల స్థాపనకు విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు.ప్రస్తుత ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఆయన అన్నారు.ఈ అవకాశాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకుని పిల్లల భవిష్యత్తును మెరుగుపరచాలని కోరారు.

# ప్రజావాణి ఫిర్యాదుల సత్వర పరిష్కారం

జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్



ప్రజాపక్షం/జగిత్యాలటౌన్ : ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ హాజరై ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించి మాట్లాడారు.పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు.అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 71 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల రెవెన్యూ అధికారి ప్రసాద్,జగిత్యాల ఆర్డీవో మధు సూదన్,తదితరులు ఉన్నారు.

# విద్య పేరుతో దోపిడీ:

ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి – బిజెవైఎం



ప్రజాపక్షం /మెట్‌పల్లి : మెట్‌పల్లి పట్టణంలోని పలు ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ అధిక ఫీజులు వసూలు చేసి పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారాన్ని మోపుతున్నాయని బీజేవైఎం నాయకులు ఆరోపించారు.కనీస మౌలిక వసతులు లేకపోయినా కార్పొరేట్ స్థాయి ఫీజులు వసూలు చేయడంతో పాటు పుస్తకాలు,యూనిఫాంలు,టైలు,బెల్టులు, షూస్ తదితర వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తూ తల్లిదండ్రులను ఆర్థికంగా దోపిడీ చేస్తున్నారని వారు పేర్కొన్నారు. అలాగే విద్యా హక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాల్సిన నిబంధనను పలు పాఠశాలలు అమలు చేయడం లేదని ఆరోపించారు.ఇలాంటి విద్యాసంస్థల యాజమాన్యాలపై సంబంధిత అధికారులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేవైఎం నాయకులు ప్రజావాణి కార్యక్రమంలో ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా కార్యదర్శి గోపి నావేణి రమేష్, అధికార ప్రతినిధి బొడ్డ నరేష్,నూనె క్రాంతి కుమార్,తదితరులు పాల్గొన్నారు.

# శివాజీ నగర్ జెడ్‌పిహెచ్‌ఎస్‌లో మౌలిక సదుపాయాలు



ప్రజాపక్షం/మెట్‌పల్లి : మెట్‌పల్లి పట్టణంలోని శివాజీ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూత్రశాలల లేమితో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల విషయాన్ని వైస్ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు దృష్టికి తీసుకువచ్చారు.ఈ సమస్యపై ఆయన జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి నిధులు మంజూరు చేయించడంతో పనులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా నిర్మించిన మూత్రశాలలను మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్ , మండల ఎమ్ఇఒ కనకతార,పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు కలిసి ప్రారంభించారు.అనంతరం పాఠశాలలో 10వ తరగతి పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులను జువ్వాడి నర్సింగ్ రావు శాలువాతో సన్మానించారు. అలాగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసి సత్కరించారు.అథ్లెటిక్స్‌లో విజయం సాధించిన ఓ విద్యార్థినికి కంటి చూపు సమస్య ఉన్నట్లు తెలియడంతో, ఆమెకు హైదరాబాద్‌లో వైద్య పరీక్షలు చేయిస్తానని జువ్వాడి నర్సింగ్ రావు హామీ ఇచ్చారు.విద్యార్థిని తల్లిదండ్రులతో కలిసి హైదరాబాద్‌కు రావాలని మున్సిపల్ వైస్ చైర్మన్‌ను కోరారు.పాఠశాల అభివృద్ధికి అన్ని విధాలుగా సహకారం అందిస్తానని జువ్వాడి నర్సింగ్ రావు తెలిపారు.

# సిమెంట్ బెంచీల వితరణ

ప్రజాపక్షం/మెట్‌పల్లి : కోర్టులో క్లయింట్ల వేయిటింగ్ కోసం ఏర్పాటు చేసిన నాలుగు సిమెంట్ బెంచీలను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి రామ్ రెడ్డి సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లయింట్ల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మీడియేషన్ కోఆర్డినేటర్లు ఒజ్జెల శ్రీనివాస్,బక్కూరి రమేష్,తునికి వేణుగోపాల్, పసునూరి శ్రీనివాస్ ఈ విషయాన్ని నితిన్ చారిటబుల్ ట్రస్ట్‌కు తెలియజేయగా, ట్రస్ట్ వ్యవస్థాపకులు డా. రాణావేన సత్యనారాయణ వెంటనే స్పందించి బెంచీలను అందించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. క్లయింట్ల సౌకర్యార్థం బెంచీలు ఏర్పాటు చేయడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, న్యాయవాదులు గుండ్ర ప్రవీణ్ రావు,పోలకొండ దయాకర్ వర్మ, గడ్డం శంకర్ రెడ్డి, బిద్దం లక్ష్మీ రెడ్డి, వంగరి గంగరాజం,పులి నర్సయ్య,పుప్పాల లింబాద్రి, నేరెళ్ల శ్రీధర్,పడిగేల శ్రీనివాస్, మార్క వంశీ, గజ్జెల్లి రాందాస్, అలాల శంకర్, కడారి యుగంధర్,తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు:ఎస్పి

ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు గ్రీవెన్స్‌డే ను ఏర్పాటు చేసినట్లు జగిత్యాల జిల్లా ఎస్పి అశోక్ కుమార్ పేర్కొన్నారు. ప్రజా గ్రీవెన్స్ డే కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పి అశోక్ కుమార్ ప్రజల నుండి వచ్చిన పలు ఫిర్యాదులను స్వయంగా పరిశీలించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 13 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు.ప్రతి ఫిర్యాదును న్యాయబద్ధంగా, పారదర్శకంగా విచారించి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చట్ట పరిధిలో పరిష్కరించగల సమస్యలను ఆలస్యం లేకుండా వెంటనే పరిష్కరించాలని, విచారణ ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు,తదితరులు ఉన్నారు.

# ఉప సర్పంచ్‌ల ఫోరం మండల ఆధ్యక్షుడిగా దగ్గుల వీరేశం ఏకగ్రీవ ఎన్నిక

ప్రజాపక్షం/బీర్‌పూర్: జగిత్యాల జిల్లా బీరపూర్ మండల ఉప సర్పంచ్ ల శ్రీ కృష్ణ యాదవ సంఘం లో సమావేశంలో ఉప సర్పంచ్ ల జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని మంగేళ గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ దగ్గుల వీరేశం ఉపాధ్యక్షులు గా నారపాక రమేష్ ప్రధాన కార్యదర్శి గా తర్లల మల్లేశం కోశాధికారి గా జక్కుల నాగరాజు సంహాదారుగా శీలం లింగన్న గౌడ్ ఏక గ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల ఉప సర్పంచ్ లు ప్రకటించారు.వీరి నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఉప సర్పంచ్‌ల ఫోరం మండల ఆధ్యక్షుడు దగ్గుల వీరేశం మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉప సర్పంచ్‌ల ఐక్యతకు హక్కుల సాధనకు కృషి చేస్తానని అన్నారు.తన నియామకానికి సహకరించిన మండల ఉపసర్పంచ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ఉప సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీలతో సమావేశం

ప్రజాపక్షం / సారంగాపూర్ : జగిత్యాల జిల్లా సారంగాపూర్ గ్రామ పంచాయితీ పరిధిలో డిఆర్‌డిఒ పిడి రఘువరన్ ఆధ్వర్యంలో అమృత్ సరోవర్ ప్రాంతంలో ఉపాధి హామీ కూలీలతో సమావేశం అయ్యారు. అనంతరం మొక్కలు నాటారు. కూలీ డబ్బులు ఎంత వస్తున్నాయి. ఎంత టైం వరకు పని చేస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ఎస్‌డబ్ల్యుం 2026 విషయాలు కూడా వివరంగా కూలీలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ మహమ్మద్ సలీం, స్థానిక సర్పంచ్ అరుణ శేఖర్, పంచాయతీ కార్యదర్శి ప్రేమలత, ఉపాధి హామీ సిబ్బంది మనోజ్, శ్రీలత, శివ, కోటి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# ఫీల్డ్ ఛానెల్‌ను ప్రారంభించిన సర్పంచ్ కోలపాక రాధ రాజు

ప్రజాపక్షం/సారంగాపూర్ : జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామంలోని ఫీల్డ్ ఛానల్‌ను సోమవారం సర్పంచ్ కోలపాక రాధ రాజు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు పొలాలకు వెళ్లే ఫీల్డ్ ఛానెల్స్ ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిరుపతి, పాలక వర్గం, మెట్లు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.